


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక :100 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శుక్రవారం 13 డిసెంబర్ 2024 వెల : 5/-రూ॥
VOLUME : 11 ISSUE :100 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA FRI 13 DECEMBER 2024 PRICE : 5/- RS
Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## నాలెడ్జి సొసైటీ లక్ష్యానికి లోబడి విద్యావ్యవస్థలో మార్పులు రావాల్సి ఉంది

- మానవ వనరుల శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష
- అంతర్జాతీయ విద్యాసంస్థలకు దీటుగా కరిక్యులమ్ లో మార్పులు చేయాలని సూచన
- కలెక్టివ్ టీమ్ బిల్డింగ్ తో విద్యారంగ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని నిర్దేశం



**పెన్ పవర్ డెస్క్:**నాలెడ్జి సొసైటీ మన ప్రభుత్వ లక్ష్యం... ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. మానవ వనరుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడారు. "ఆన్ లైన్, ఆఫ్ లైన్ విధానాల ద్వారా అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు తేవాలి. ప్రైవేటు విద్యావ్యవస్థను తొక్కేయడం మన విధానం కాదు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్యారంగాన్ని తీర్చిదిద్దాలన్నదే తమ ధ్యేయం. రాబోయే రోజుల్లో నాలెడ్జి ఎకానమీలో తెలుగు విద్యార్థులు నెం.1గా నిలవాలి. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో పేరెన్నికగన్న విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలకు ప్రత్యేక బృందాలను పంపి అక్కడ బోధన, అభ్యసన పద్ధతులపై అధ్యయనం చేయాలి. తదనుగుణంగా కరిక్యులమ్ లో మార్పులు చేసి, ఎన్ఐఆర్ఎఫ్,
గ్లోబల్ ర్యాంకింగ్స్ మెరుగుదలకు చర్యలు చేపట్టాలి. సివిల్ ఏవియేషన్, గ్రీన్ ఎనర్జీ, టూరిజం రంగాల్లో భవిష్యత్ అవకాశాలను అంచనావేసి ఆయా యూనివర్సిటీల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి. స్కిల్స్, ఎంప్లాయ్ మెంట్ ను బ్యాలెన్స్ చేయాల్సి ఉంది. ఇందుకోసం అమరావతి రాజధానిలో ఏర్పాటుచేసే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తో రాష్ట్రంలోని 5 జోన్లలోని స్కిల్ డెవలప్ మెంట్ సంస్థలను అనుసంధానిస్తాం.
డిజిటల్ టీచింగ్, లెర్నింగ్ పై దృష్టి సారించాలి. సొసైటీ అవసరాలను బట్టి స్కిల్ అప్ గ్రేడేషన్ చేపట్టాలి. ఒకేషనల్ విద్యపై దృష్టిసారించాలి. పాఠశాలల్లో రేటింగ్ మెరుగుదలకు కలెక్టివ్ టీమ్ బిల్డింగ్ తో ర్యాంకింగ్స్ మెరుగుదలకు కృషిచేసి, విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులంతా కృషిచేయాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజ్ఞప్తిచేశారు.

## కేంద్రం స్పందించే వరకు విచారణ ఆపండి

### ప్రార్ధనా స్థలాలపై సుప్రీం కోర్టు కీలక నిర్ణయం



**పెన్ పవర్ డెస్క్:** దేశంలోని ప్రార్ధనా స్థలాల విచారణలపై సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రార్థనా స్థలాల దర్యాప్తును నాలుగు వారాల పాటు ఆపేయాలని దేశ అత్యున్నత న్యాయస్థానం దిగువ కోర్టులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా, 1991 ప్రార్థనా స్థలాల చట్టంలోని కొన్ని నిబంధనలను సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు అయ్యాయి.

వివరాలు 2లో..

## ప్రభుత్వ స్కూళ్లలో ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కు, ఎకడమిక్ ఫలితాలకు పొంతన ఉండటం లేదు

- అమరావతిలో జిల్లా కలెక్టర్లతో సమావేశం
- హాజరైన మంత్రి నారా లోకేశ్
- జీరో డ్రాపవుట్స్, ఎన్ రోల్ మెంట్ పై దృష్టి సారించాలని వెల్లడి
- మధ్యాహ్న భోజనం, హాస్టల్ మెస్ నాణ్యతకు చర్యలు తీసుకోవాలని స్పష్టీకరణ



**పెన్ పవర్ డెస్క్:**గత ఐదేళ్లలో విద్యారంగాన్ని పట్టించుకోలేదని, రాబోయే ఐదేళ్లలో మౌలిక సదుపాయాలు, ఫలితాలపై దృష్టిసారించి ఏపీ మోడల్ విద్యావ్యవస్థ రూపకల్పనకు అధికారులంతా నడుంబిగించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సచివాలయంలో కలెక్టర్ల సమావేశంలో మానవవనరుల శాఖపై సమీక్షలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్ రోల్ మెంట్ పెరగాలని, జీరో డ్రాపవుట్స్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "ప్రభుత్వ స్కూళ్లలో ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కు, ఎకడమిక్ ఫలితాలకు

వివరాలు 2లో..

## వైసీపీ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు... కేక్ కట్ చేసిన జగన్



- మరికొన్ని రోజుల్లో క్రిస్మస్
- మేనత్తతో కలిసి సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న జగన్
- సందడిగా వైసీపీ ప్రధాన కార్యాలయం

**పెన్ పవర్ డెస్క్:** క్రైస్తవులకు అత్యంత పవిత్రమైన క్రిస్మస్ పర్వది నం (డిసెంబరు 25) సమీపి స్తోంది. ఈ నేపథ్యం లో, తాడేపల్లిలోని వైసీపీ ప్రధాన కార్యాలయంలో నేడు సెమీ క్రిస్మస్ వేడు కలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో

వివరాలు 2లో..

## మాజీ సీఎం జగన్‌కు షాక్.. ఆ భూములు వెనక్కి తీసుకుంటూ ప్రభుత్వం ఉత్తర్వులు!



- సరస్వతి పవర్ అసైన్డ్ భూములను వెనక్కి తీసుకుంటూ సర్కార్ నిర్ణయం
- మాచవరం మండలంలోని 17.69 ఎకరాల భూములను వెనక్కి తీసుకుంటున్నట్లు ఉత్తర్వులు
- డిప్యూటీ సీఎం ఆదేశాలతో మాచవరానికి చెందిన సరస్వతి పవర్ అసైన్డ్ భూముల పరిశీలన
- రెవన్యూ అధికారుల నివేదిక అనంతరం కూటమి ప్రభుత్వం తాజా నిర్ణయం

వివరాలు 2లో..

## వైసీపీలో మరో వికెట్ డౌన్.. మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రాజీనామా

- ఉదయం పార్టీకి రాజీనామా చేసిన అవంతి శ్రీనివాస్
- కాసేపటికే రాజీనామా చేసినట్టు ప్రకటించిన గ్రంధి శ్రీనివాస్
- రాజీనామా లేఖను జగన్ కు పంపించిన మాజీ ఎమ్మెల్యే



**పెన్ పవర్ డెస్క్:**అధికారాన్ని కోల్పోయిన వైసీపీకి భారీ షాకులు తగులుతున్నాయి. ఆ పార్టీకి మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ ఈరోజు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. అవంతి రాజీనామా చేసిన కాసేపటికే మరో కీలక నేత పార్టీని వీడారు. భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వైసీపీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు పార్టీ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ అధినేత

వివరాలు 2లో..

## ఛత్తీస్ గఢ్ లో భారీ ఎన్ కౌంటర్.. 12 మంది మావోయిస్టులు మృతి

- అబూజ్ మడ్ అటవీప్రాంతంలో భారీ ఎన్ కౌంటర్
- భద్రతా బలగాలకు ఎదురుపడిన నక్సల్స్
- మావోయిస్టులకు మరోసారి తీవ్ర నష్టం
- కొనసాగుతున్న యాంటీ నక్సల్ ఆపరేషన్



**పెన్ పవర్ డెస్క్:**ఛత్తీస్ గఢ్ లో మరో భారీ ఎన్ కౌంటర్ జరిగింది, అబూజ్‌మడ్ అవీప్రాంతంలో పోలీసులకు.. మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఛత్తీస్ గఢ్ లో మరో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. అబూజ్‌మడ్ లో జరిగిన ఎన్ కౌంటర్ లో 12 మంది మావోయిస్టులు మృతి చెందారు. భారీగా ఆయుధాలను, విప్లవసాహిత్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని సమాచారం. వరస దెబ్బలు... మావోయిస్టులకు ఇటీవల వరస దెబ్బలు తగులుతున్నాయి. ఇటీవల కాలంలో వరస ఎన్ కౌంటర్ లు జరుగుతున్నాయి. మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో భద్రతాదళాలు పెద్దయెత్తున గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ నేపథ్యంలోనే ఎన్ కౌంటర్ జరిగింది. మావోయిస్టులు కూడా ఎదురు కాల్పులకు పాల్పడ్డారు. పక్కా సమాచారంతో కూబింగ్ నిర్వహిస్తున్న

వివరాలు 2లో..

## మేం మళ్లీ వస్తే.. మహిళలకు నెలకు రూ.2,100 ఇస్తాం

- మళ్లీ గెలిపిస్తే ప్రతి మహిళకు నెలకు రూ.2,100 ఇస్తాం: కేజ్రీవాల్ హామీ
- సీఎం అతిశీతో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేజ్రీవాల్
- రూ.2,100 మహిళ ఖాతాలోకి నేరుగా జమ చేస్తామని వెల్లడి
- కొందరు మహిళల అభ్యర్థన మేరకు ఈ హామీ ఇచ్చినట్టు వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవిందవ్ కేజ్రీవాల్ ఢిల్లీ మహిళలకు బంపర్ ఆఫర్ ఇచ్చారు. మహిళా సమ్మాన్ యోజనకు ఢిల్లీ ప్రభుత్వం కేబినెట్ ఆమోదం తెలి పింది. ఈ పథకం కింద గురువారం ( డిసెంబర్ 12) నుంచి దేశరాజధానిలోని మహిళలకు నెలకు రూ.1000 ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతో పాటు మరో బంపర్ ఆఫర్ కూడా ఇచ్చారు. ఢిల్లీలో ఆప్ తిరిగి అధికారంలోకి వస్తే .. మహిళా సమ్మాన్ యోజన కింద వెయ్యికి బదులుగా రూ. 2వేలు ఇస్తామని

వివరాలు 2లో..

## ఎవరి కోరిక సామీ: ప్రశాంత్ కిషోర్‌తో అల్లు అర్జున్ భేటీ..!?



పొలిటికల్ ఎంట్రీ ఇస్తారా..?
ముందు సోషల్ సర్వీస్ చేయాలన్న ప్రశాంత్ కిషోర్
సినీ, రాజకీయ వర్గాల్లో చర్చ

వివరాలు 2లో..

## వన్ నేషన్.. వన్ ఎలక్షన్ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం



- మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం
- జమిలికి ఆమోదముద్ర వేసిన కేబినెట్
- ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టే అవకాశం

**పెన్ పవర్ డెస్క్:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకున్నది. ఒకే దేశం.. ఒకే ఎన్నికలు.. అదే వన్ నేషన్.. వన్ ఎలక్షన్ బిల్లు విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఎన్నికల్లో సంస్కరణలు తీసుకు వచ్చే ఉద్దేశంతో.. పార్లమెంట్, దేశంలోని అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకే సారి ఎన్నికలు నిర్వహించాలనే లక్ష్యంతో ఈ బిల్లు తీసుకొచ్చింది. ఈ బిల్లుకు 2024, డిసెంబర్ 12వ తేదీ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కేంద్ర కేబినెట్ ఆమోదం పొందిన వన్ నేషన్.. వన్ ఎలక్షన్ బిల్లును.. ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ఉపరాష్ట్రపతిపై అవిశ్వాసమా

రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సభలో అత్యంత పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఇండియా కూటమి పార్టీలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాజ్యసభ ఛైర్మన్‌గా వ్యవహరించే ఉపరాష్ట్రపతిపై ఈ విధంగా అవిశ్వాసాన్ని ప్రకటించడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి. ఈ తీర్మానం నెగ్గడానికి కావలసిన బలం విపక్షాలకు లేకపోయినా, పార్లమెంట్ విలువలను కాపాడడానికి, రాజ్యాంగ పరిరక్షణ, సభ్యుల హక్కుల కోసం ఈ నిర్ణయం తీసుకోవలసి వచ్చిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (ఇన్‌ఛార్జి కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ అభిప్రాయాన్ని వెలిబుచ్చడం ఈ సందర్భంగా గమనించవలసి ఉంది. ఇది వ్యక్తులకు వ్యతిరేకంగా కాదని, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటమని ఇండియా కూటమి నేతలు స్పష్టం చేస్తున్నారు. ఈ నిర్ణయం బాధాకరమే అయినా పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అవిశ్వాసం పెట్టినట్టు ఇండియా కూటమి పేర్కొంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 67 (బి) ప్రకారం కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్ (రాజ్యసభ) తీర్మానం ద్వారా ఉపరాష్ట్రపతిని పదవి నుంచి తొలగించవచ్చు. అయితే తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు సభలోని సభ్యుల్లో మెజారిటీ ఆమోదించాల్సి ఉంటుంది. తీర్మానాన్ని ప్రతిపాదించడానికి కనీసం 50 మంది సభ్యులైనా ఉండాలి. అయితే ఇండియా బ్లాక్‌కు చెందిన 60 మందికి పైగా సభ్యులు ఈ తీర్మానంపై సంతకాలు చేశారు. సంతకాలు చేసిన వారిలో రాష్ట్రీయ జనతాదళ్, తృణమూల్ కాంగ్రెస్, సిపిఐ, జార్ఖండ్ ముక్తి మోర్చా, ఆమ్‌ఆద్మీ పార్టీ, డిఎంకె పార్టీలకు చెందిన ఎంపిలు ఉన్నారు. అయితే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, ఇతర పార్టీల ఫ్లోర్ లీడర్లు తీర్మానంపై సంతకాలు చేయలేదు. ఉపరాష్ట్రపతికి వ్యతిరేకంగా తీర్మానం ప్రతిపాదించడానికి ఈ ఏడాది ఆగస్టులో కూడా ప్రతిపక్షాలు ప్రయత్నించాయి. ఈ తీర్మానం రాజ్యసభతో పాటు లోక్‌సభలో కూడా ఆమోదం పొందవలసి ఉంటుంది. ఈ మేరకు ఉభయసభల్లో మెజారిటీని సాధించడం చాలా కీలకం. సాధారణంగా ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయినప్పుడు, దాని పాలనా సామర్థ్యాన్ని సవాల్ చేయడానికి ప్రతిపక్షాలకు రాజ్యాంగం కల్పించిన హక్కే అవిశ్వాస తీర్మానం. అవిశ్వాస తీర్మానం నెగ్గితే ప్రభుత్వం దిగిపోవాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు ప్రభుత్వంపై అవిశ్వాసం కాదు, రాజ్యసభ ఛైర్మన్ అయిన ఉపరాష్ట్రపతి పక్షపాత వైఖరిపైన అవిశ్వాసం. మనదేశంలో సాధారణంగా లోక్‌సభలోనే ప్రభుత్వంపై లేదా ప్రధాన మంత్రి పైన లేదా కేబినెట్ మంత్రుల పైనా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం చూస్తుంటాం. అవిశ్వాస తీర్మానానికి సభ్యులు మద్దతు ఇచ్చిన తరువాత స్పీకర్ సెలవు మంజూరు చేయవచ్చు. రాజ్యసభలో ఎన్‌డీఏకి పూర్తి మెజారిటీ ఉందని.. ఈ తీర్మానాన్ని తిరస్కరించడం ఖాయమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు వ్యాఖ్యానించారు. 'రాజ్యసభ ఛైర్మన్ మనకు మార్గదర్శి. సభ సజావుగా నడిచేందుకు ఆయన చెప్పేది అందరూ వినాలి. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఎల్లప్పుడూ ఛైర్మన్‌ను అవమానిస్తుంటాయి' అని ధ్వజమెత్తారు. విపక్షాలకు రాజ్యాంగ నియమాలు తెలియవని.. ఉపరాష్ట్రపతిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టరాదని బీజేపీ ఎంపీ దినేశ్ శర్మ అన్నారు. 67(బీ) అధికరణ ప్రకారం అభిశంసన తీర్మానం మాత్రమే ప్రవేశపెట్టాలని చెప్పారు. ధన్‌ఖడ్‌పై ఒత్తిడి తేవడానికి విపక్షం ప్రయత్నిస్తోందన్నారు. టీఎంసీ ఎంపీ సాగరిక ఘోష్ మాట్లాడుతూ.. ఈ తీర్మానం ఆమోదానికి తగిన సంఖ్యాబలం తమకు లేదని.. కానీ ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కోసం పోరాడేందుకు బలమైన సందేశంగా పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఏ వ్యక్తిపైనా తమకు ఎలాంటి వ్యతిరేకతా లేదన్నారు. లోక్‌సభలోని నిబంధనలు ప్రకారం 16వ ఎడిషన్‌లోని రూల్ 198 లోని సబ్‌రూల్ (2). (3) కింద తీర్మానంపై చర్చ కోసం ఒకటి రెండు రోజులు కేటాయిస్తుంటారు. ఆ తరువాత దీనిపై ఓటింగ్‌లో తీర్మానానికి అనుకూలంగా మెజారిటీ సభ్యులు ఓటు వేస్తే అది ఆమోదం పొందుతుంది. మనదేశంలో ఈ అవిశ్వాస తీర్మానాలు ఎక్కువగా ప్రధాన మంత్రులపైనే జరిగాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు లోక్‌సభలో 27 అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టారు. కానీ వీటిలో ఏ ఒక్కటీ నెగ్గలేదు. అయితే 1979 జులైలో మొరార్జీదేశాయ్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా, దానిపై ఓటింగ్ జరగకముందే ఆయన ప్రధాని పదవికి రాజీనామా చేశారు. అయితే అధికారంలో ఉన్న ప్రభుత్వంపై సభలో ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానాలు మాత్రం మూడు సార్లు ఓడిపోయి ప్రభుత్వాలు పడిపోయాయి. భారత ప్రధానుల్లో ఇందిరాగాంధీ ఎక్కువ అవిశ్వాస తీర్మానాలను 15 వరకు ఎదుర్కొన్నారు. ఇందిరాగాంధీపై తొలి అవిశ్వాసాన్ని 1966లో ఆమె అధికారంలోకి రాగానే కమ్యూనిస్టు నేత హీరేంద్రనాథ్ ముఖర్జీ ప్రవేశపెట్టారు. కేవలం 61 మంది ఎంపిలే మద్దతు ఇవ్వగా, 270 మంది వ్యతిరేకించారు. 1966లోనే ఆమెపై రెండో అవిశ్వాసం వచ్చింది. తరువాత 1967, 1968( రెండు సార్లు), 1969, 1970, 1973, 1974 (రెండు సార్లు ), 1975 (రెండు సార్లు రెండోసారి ఎమర్జెన్సీ విధింపునకు కేవలం నెల రోజుల ముందు) 1976, 1978, 1981 (రెండు సార్లు), 1982 లో ఇందిరపై అవిశ్వాస తీర్మానాలు వచ్చాయి. 1976లో ఇందిర ప్రభుత్వంపై బిజెపి అగ్రనేత వాజ్‌పేయ్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినా, కేవలం 162 మంది మాత్రమే మద్దతు ఇచ్చారు. 257 మంది వ్యతిరేకించడంతో తీర్మానం వీగిపోయింది. స్వతంత్ర భారత చరిత్రలో మొట్టమొదటిసారి చైనా భారత యుద్ధం జరిగిన తరువాత 1963లో అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జెబి కృపలానీ లోక్‌సభలో మొట్టమొదటిసారి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. నెహ్రూ మాదిరిగానే రాజీవ్ గాంధీ, విపి సింగ్, హెచ్‌డి దేవగౌడ, అటల్ బిహారీ వాజ్‌పేయ్, మన్మోహన్ సింగ్ ఒక్కొక్కసారి మాత్రమే అవిశ్వాస తీర్మానాలను ఎదుర్కొన్నారు. దేశ చరిత్రలో 2023 ఆగస్టు వరకు 31 అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టినట్టు రికార్డయింది. అప్పటి ప్రధానులు లాల్‌బహదూర్ శాస్త్రి, పివి నరసింహారావు మూడేసి సార్లు, మొరార్జీ దేశాయ్, నరేంద్ర మోడీ రెండేసి సార్లు అవిశ్వాసాన్ని ఎదుర్కొన్నారు. 1999 ఏప్రిల్‌లో అప్పటి ప్రధాని వాజ్‌పేయ్ ఒకే ఒక్క ఓటు (269–270) తేడాతో అవిశ్వాస తీర్మానంలో ఓడిపోవలసి వచ్చింది. విపిసింగ్, హెచ్‌డి దేవెగౌడ కూడా అవిశ్వాసం తీర్మానంలో నెగ్గుకు రాలేకపోయారు. 2018, 2023లో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెండు సార్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినా బయటపడగలిగారు.

# కేంద్రం స్పందించే వరకు విచారణ ఆపండి

- మొదటి పేజీ తరువాయి

ఈ పిటిషన్లపై గురువారం (డిసెంబర్ 12) ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ కెవి విశ్వనాథన్, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ప్రత్యేక బెంచ్ విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. 1991 ప్రార్థనా స్థలాల చట్టంలోని కొన్ని నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ ప్రారంభించినందున.. దేశంలోని మసీదులతో సహా ప్రార్థనా స్థలాలపై కొనసాగుతున్న సర్వేలను నిలిపివేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. అలాగే, దేశంలోని వివిధ కోర్టుల్లో ప్రార్థనా స్థలాల వివాదాలకు సంబంధించిన పిటిషన్లపై జరుగుతోన్న విచారణలను కూడా ఆపేయాలని దిగువ కోర్టులను సుప్రీం ఆదేశించింది. దీంతో పాటుగా విచారణ పూర్తి అయిన పిటిషన్లపై తుది తీర్పును వెలువరించవద్దని సూచించింది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఈ ఉత్తర్వుల్లో అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది సుప్రీం కోర్టు. ప్రార్థనా స్థలాల అంశంపై రిప్లై ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి నాలుగు వారాల సమయం ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం తన స్పందనను తెలిపే వరకు ఈ అంశంపై నిర్ణయం తీసుకోలేమని సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. కాగా, ఇటీవల దేశంలో ప్రార్థనా స్థలాల వివాదాలు పెరిగిపోతున్నాయి. జ్ఞానవాపీ మసీదు, షాహీ ఈద్గా, సంభాల్ మసీదు వ్యవహారం దేశంలో ఎంత దూమారం రేపింది తెలిసిందే. ఈ మసీదుల కింద గతంలో హిందు దేవాలయాలు ఉన్నాయని.. తిరిగి అక్కడ

ఆలయాలు నిర్మించాలని కోరుతూ పలువురు హిందువులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ పిటిషన్లను విచారణకు స్వీకరించిన కోర్టులు.. మసీదుల్లో సర్వే చేయాలని ఆదేశించాయి. మసీదుల దగ్గర సర్వే సమయంలో పలు చోట్ల మత ఘర్షణలు చెలరేగాయి. సంభాల్ మసీదు వద్ద అధికారులు సర్వేకు వెళ్లగా అక్కడ అల్లర్లు జరిగి ప్రాణ నష్టం చోటు చేసుకుంది. దీంతో 1991 ప్రార్థనా స్థలాల చట్టాలకు విరుద్ధంగా దిగువ కోర్టులు ఆదేశాలు ఇచ్చాయని పలువురు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే సుప్రీం కోర్టు పై ఆదేశాలను జారీ చేసింది.

# మాజీ సీఎం జగన్‌కు షాక్.. ఆ భూములు వెనక్కి తీసుకుంటూ ప్రభుత్వం ఉత్తర్వులు!

**పెన్ పవర్ డెస్క్:** ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు కూటమి ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చింది. సరస్వతి పవర్ అసైన్డ్ భూములను వెనక్కి తీసుకుంటూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. మాచవరం మండలంలోని 17.69 ఎకరాల భూములను వెనక్కి తీసుకుంటున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది.

**అసలేం జరిగిందంటే..**

ఇటీవల వైఎస్ జగన్, ఆయన సోదరి షర్మిల, తల్లి విజయమ్మ ఆస్తుల వివాదం కోర్టుకు చేరింది. దాంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అధికారులు జగన్ తాలూకు మాచవరానికి చెందిన సరస్వతి పవర్ అసైన్డ్ భూములను పరిశీలించారు. ఈ సంస్థకు చెందిన భూములపై ఆరా తీయాల్సిందిగా అధికారులను పవన్ ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు ఆర్ఎస్ఆర్, ఎఫ్ఎంబీ రికార్డులను అధికారులు చెక్ చేశారు.

మాచవరం ఎంఆర్ఓ క్షమారాణి, వీఆర్ఓ అఖిల్, ఆర్ఐ కోటేశ్వరరావు, సర్వేయర్ సాల్మన్ రాజు, దాచేపల్లి అటవీశాఖ డిప్యూటీ రేంజ్

అధికారి కే విజయలక్ష్మీ, బీట్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, మనోజ్.. సరస్వతి సిమెంట్, పవర్ భూములను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఆ నివేదిక ఆధారంగా మాచవరం మండలంలోని 17.69 ఎకరాల భూములను వెనక్కి తీసుకుంటున్నట్లు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది.

# వైసీపీ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు... కేక్ కట్ చేసిన జగన్

- మొదటి పేజీ తరువాయి

జగన్, ఆయన మేనత్త వైఎస్ విమలమ్మ, ఇతర వైసీపీ నేతలు, క్రైస్తవ మతపెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ తన మేనత్తతో కలిసి కేక్ కట్ చేశారు. పలువురికి ఆయన శాలువాలు కప్పి సన్మానించారు. దీనికి సంబంధించిన వీడియోను వైసీపీ తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంది.

# ఎవరి కోరిక సామీ: ప్రశాంత్ కిషోర్‌తో అల్లు అర్జున్ భేటీ..!?

**పెన్ పవర్ డెస్క్:** రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తో ప్రముఖ హీరో అల్లు అర్జున్ రహస్యంగా భేటీ అయినట్టు తెలుస్తోంది. దీంతో ఆయన రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నారా..? అన్న చర్చ మొదలైంది. ఏపీ ఎన్నికల సమయంలో నంద్యాల వైసీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్రారెడ్డి తరఫున ఆయన ప్రచారం చేశారు. శిల్పా రవిచంద్ర బన్నీకి మిత్రుడు. ఈ నేపథ్యంలో బన్నీ తన సతీమణి స్నేహారెడ్డితో కలిసి వెళ్లి ప్రచారం చేశారు. దీనిపై మెగా ఫ్యామిలీ భగ్గుమంది. ఆ తర్వాత రెండు ఫ్యామిలీల మధ్య దూరం పెరిగింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బన్నీపై ట్రోల్స్ పెరిగాయి. ఒక దశలో పుష్ప%–%2 విడుదలపైనా అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. తర్వాత పుష్ప%–%2 రికార్డుల మోత మోగిస్తోంది. ఈ క్రమంలో అల్లు అర్జున్ నార్త్ లోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇదే తరుణంలో ఆయన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని పీకే బన్నీకి సూచించినట్టుగా తెలుస్తోంది.

# ఛత్తీస్ గఢ్ లో భారీ ఎన్ కౌంటర్.. 12 మంది మావోయిస్టులు మృతి

- మొదటి పేజీ తరువాయి

భద్రతా దళాలకు... మావోయిస్టులు ఎదురుపడ్డారు. దీంతో రెండు వర్గాలు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది.

అబూజ్ మడ్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ చేస్తుండగా, మావోలు కాల్పులు జరిపారు. భద్రతా బలగాలు కూడా దీటుగా స్పందించి ఎదురు కాల్పులతో బదులిచ్చాయి. ఈ కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందారు.

అబూజ్ మఢ్ దట్టమైన అడవిలోని ఒక కొండ ప్రాంతం. ఇది నారాయణపూర్, బీజాపూర్, దంతెవాడ జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. భౌగోళికంగా మావోయిస్ట్ లకు అత్యంత అనుకూలమైన ప్రాంతం. ఇక్కడికి చేరుకోవడం అత్యంత క్లిష్టతరం.

ఈ ప్రాంతాన్ని మావోయిస్టుల కార్యకలాపాలకు కేంద్రంగా పరిగణిస్తారు. చత్తీస్ గఢ్ కేంద్రంగా మావోయిస్ట్ ల ఏరివేత కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ప్రారంభించారు. మావోల జాడపై సమాచారం తెలిసిన వెంటనే సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి, ఎన్ కౌంటర్ లు చేపడుతున్నారు. ఈ ఆపరేషన్ లో ఇప్పటికే చాలామంది మావోలు మృతి చెందారు

# ప్రభుత్వ స్కూళ్లలో ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కు, ఎకడమిక్ ఫలితాలకు పొంతన ఉండటం లేదు

- మొదటి పేజీ తరువాయి

పొంతన ఉండటం లేదు. పారదర్శకమైన విధానాలతో మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలి. మౌలిక సదుపాయాలు, ఎకడమిక్ పెర్ఫార్మెన్స్ ను పొందుపరుస్తూ జిల్లాలవారీగా ప్రోగ్రెస్ రిపోర్ట్ కార్డులను అందజేస్తున్నాం. రాబోయే వంద రోజుల యాక్షన్ ప్లాన్ కు అనుగుణంగా అధికారులు దృష్టి సారించాలి.

ముఖ్యంగా జిల్లా కలెక్టర్లు చిన్నారులకు అందించే మధ్యాహ్న భోజనంపై దృష్టి సారించాలి. పోషకవిలువలు కలిగిన పౌష్టికాహారం అందజేసేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం లోకల్ మెనూతో మధ్యాహ్న భోజనం అందించే వెసులుబాటును కలెక్టర్లకు కల్పించాం. ఉన్నత విద్యలో కూడా హాస్టల్, భోజన సౌకర్యాలపై దృష్టిపెట్టాలి.

ఇటీవల కాలంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. హాస్టళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ, కనీస మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. ఇందుకోసం ప్రతివారం విద్యార్థులనుంచి ఫీడ్ బ్యాక్ తీసుకునే విధానాన్ని చేపట్టాం. ఫీడ్ బ్యాక్ ఆధారంగా మెస్, సౌకర్యాల మెరుగుదలకు చర్యలు చేపట్టాలి.

పాఠశాలలు, కళాశాలల్లో మత్తుపదార్థాల నివారణకు డ్రగ్స్ వద్దు బ్రో పేరుతో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నాం. అన్ని స్కూళ్లు, కాలేజీల్లో ఈగల్ టీమ్స్, క్లబ్స్ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలి. కేజీ టు పీజీ కరిక్యులమ్ ప్రక్షాళనను చర్యలు చేపడుతున్నాం. అపార్ ఐడీ విషయంలో కొన్ని సమస్యలు తలెత్తాయి. దీనివల్ల తల్లిదండ్రులు ఇబ్బంది పడ్డారు. సాంకేతిక సమస్యలు అధిగమించి పారదర్శకంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులంతా కృషిచేయాలి" అని మంత్రి లోకేశ్ కోరారు.

# మేం మళ్లీ వస్తే.. మహిళలకు నెలకు రూ.2,100 ఇస్తాం

- మొదటి పేజీ తరువాయి

ప్రకటించారు. వచ్చే ఏడాది ( 2025) ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ కాలం ఫిబ్రవరి 23, 2025తో ముగుస్తుంది. ఇంకా తేదీ ప్రకటించక పోయి నప్పటికీ కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇచ్చిన మాట ప్రకారం ఢిల్లీ మహిళలకు మహిళా సమ్మాన్ యోజన పథకం కింద రూ.1000 ప్రకటించారు. మహిళలు రిజిస్టర్ చేయించుకొని లబ్ధి పొందాలని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ చెప్పారు.

ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో %ఆ్యూూ% రెండుసార్లు అధికారం చేపట్టింది.. మూడోసారి కూడా అధికారాన్నినిలబెట్టుకోవాలని ప్రయత్నాలు ప్రారంభించింది. 70 మంది సభ్యులున్న అసెంబ్లీలో ఆప్ 2015లో 67 సీట్లు, 2020లో 63 సీట్లు గెలుచుకుంది.

# వన్ నేషన్.. వన్ ఎలక్షన్ బిల్లుకు కేంద్ర కేబినెట్ అమోదం

- మొదటి పేజీ తరువాయి

పార్లమెంట్ సమావేశాల్లోని సభలో ప్రవేశపెట్టాలని నిర్ణయించింది కేంద్ర ప్రభుత్వం. ఇందుకు అనుగుణంగా కేబినెట్ ఆమోదం పొందింది. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ బిల్లు పార్లమెంట్ లో ఆమోదం పొందితే.. ఆ తర్వాత రాష్ట్రపతి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ బిల్లు అమల్లోకి వస్తే మాత్రం.. దేశంలో లోక్ సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తారు. ఆ తర్వాత 100 రోజుల్లో అంటే.. 3 నెల్లో దేశం మొత్తం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అదే విధంగా ఉమ్మడి ఓటర్ల జాబితా, ఓటర్ ఐడీ వ్యవస్థను కూడా రూపొందించాలని కమిటీ సిఫార్సు చేసింది. ఈ సూచనలు అమలు చేయాలంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 18లో సవరణలు చేయాల్సి ఉంటుంది. ఈ దిశగానూ కేంద్రం వడివడిగా అడుగులు వేస్తుంది. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తర్వాత.. అందుకు కావాల్సిన ఏర్పాట్లపై దృష్టి పెట్టనుంది కేంద్ర ప్రభుత్వం.

# వైసీపీలో మరో వికెట్ డౌన్.. మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రాజీనామా

- మొదటి పేజీ తరువాయి

జగన్ కు పంపించారు. కీలక నేతలు వరుసగా పార్టీని వీడుతుండటంతో వైసీపీ శ్రేణులు ఆందోళనకు గురవుతున్నాయి.

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను ఓడించిన ఘనత గ్రంధి శ్రీనివాస్ కు ఉంది. 2019 ఎన్నికల్లో భీమవరం నుంచి పోటీ చేసిన పవన్ పై ఆయన విజయం సాధించారు. తద్వారా పార్టీలో జెయింట్ కిల్లర్ గా గుర్తింపు పొందారు. గత ఎన్నికల్లో జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ, అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. గ్రంధి శ్రీనివాస్ ఏ పార్టీలో చేరుతారనే విషయంపై ఇంకా క్లారిటీ రాలేదు.

# ఆరు నెలలు పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం... పబ్లిసిటీ కంటే రియాలిటీకే ప్రాధాన్యమన్న లోకేశ్




ఏపీలో జూన్ 12న కూటమి ప్రభుత్వం కొలువుదీరిన సంగతి తెలిసిందే. కూటమి అధికారంలోకి వచ్చి ఆర్నెల్లయిన సందర్భంగా రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఓ ప్రకటన విడుదల చేశారు. "రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అయ్యింది. గత ఐదేళ్లలో ధ్వంసమైన రాష్ట్రం, అస్తవ్యస్తమైన వ్యవస్థలు, అప్పులు వారసత్వంగా వచ్చాయి. అయితే... సంక్షోభాలను అవకాశాలుగా తీసుకొని సంక్షేమంగా మలిచే చంద్రబాబు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర పునర్నిర్మాణం లక్ష్యంగా పనిచేస్తోంది. పిచ్చిపిచ్చి రంగులు ఉండవు... మా బొమ్మలు కనిపించవు... పబ్లిసిటీ కంటే రియాలిటీకే మా ప్రాధాన్యం. 'రాష్ట్రమే ఫస్ట్... ప్రజలే ఫైనల్' అనే నినాదం కూటమి ప్రభుత్వ విధానంగా అమలు చేస్తూ ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. అందరి సహకారంతో స్వర్ణాంధ్ర-2047 విజన్‌తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పయనింపజేస్తాం" అని నారా లోకేశ్ స్పష్టం చేశారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు



# హెూంమంత్రి అనితని కలిసిన కాకర్ల సత్యేంద్ర

**తాళ్ళపూడి, పెన్ పవర్, డిసెంబర్ 12:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనితని తాళ్ళపూడి మండలం, అన్నదేవరపేట గ్రామానికి చెందిన కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర ప్రసాద్ గురువారం మర్యాద పూర్వకంగా ఆమె నివాసంలో కలవటం జరిగింది. కొవ్వూరు నియోజకవర్గ విషయాలు హెూంమంత్రి అడిగి తెలుసుకున్నట్లు సత్యేంద్ర తెలిపారు. అదేవిధంగా కొవ్వూరు నియోజకవర్గ ప్రజల క్షేమ సమాచారం గురించి, రాజకీయ పరిణామాలు ఈ సందర్భంగా వివరించినట్లు సత్యేంద్ర తెలియజేశారు. అలాగే కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని హెూంమంత్రి అనిత అన్నారని కాకర్ల సత్యేంద్ర తెలిపారు.

# పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ దినంగా పాటించాలి

**జిల్లా కలెక్టర్ షణ్మోహన్**

**కాకినాడ.పెన్ పవర్ డిసెంబర్ 12** :రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ననుసరించి, జిల్లా, మండల, గ్రామ, నియోజకవర్గాల స్థాయిలో ఈ నెల 15వ తేదీన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ దినంగా పాటించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహణ్ సగిలి ప్రభుత్వ శాఖల అధికారులను కోరారు. ఇందులో భాగంగా అన్ని కార్యాలయాలలో అమరజీవి పొట్టి శ్రీరామలు విగ్రహాలు, చిత్రపటాలకు పులమాలలు అలంకరించి ఆయన నిరుపమాన త్యాగ నిరతికి కృతజ్ఞతాపూర్వకంగా వినమ్ర నివాళులు అర్పించాలని తెలిపారు.అలాగే పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని సూచించారు.జిల్లా బిసి సంక్షేమం, సాధికరత అధికారి,డిఈఓ, ఇంటర్మీడియేట్ విద్యాధికారి, కళాశాల విద్య ప్రాంతీయ సంచాలకులు,జడ్పి సిఈఓ, మున్సిపల్ కమీషనర్లు ఈ కార్యక్రమాలను సముచిత రీతిలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.




# విజయవాడ నుంచి టెలి కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరు ప్రశాంతి దిశా నిర్దేశం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, డిసెంబర్ 12:** స్వర్ణాంధ్ర విజన్ 2047, వికసిత భారత్ 2047 దిశగా డాక్యూమెంటరీ రూపకల్పన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఒక కేటగిరిలో ప్రముఖులు, ఇంకో కేటగిరిలో విద్యావేత్తలు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంధ సంస్థలు, స్టార్టప్, విభిన్న రంగాల్లో ప్రతిభావంతులు, వివిధ కమిటీలలో సభ్యులు, మూడో కేటగిరిలో స్థానికులుతో మేధోమధన కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలియచేశారు. గురువారం ఉదయం విజయవాడ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, డిఆర్వో టి.సీతారామ మూర్తి, సిపివో ఎల్.అప్పలకొండ, ఆర్డీవో రాణి సుస్మిత, ఆర్ కృష్ణ నాయక్ లు, యితర జిల్లా అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా నుంచి మూడు కేటగిరిల కింద ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందని కలెక్టరు ప్రశాంతి తెలియచేశారు. ప్రముఖ వ్యక్తులు, విద్యావేత్తలు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంధ సంస్థలు, రైతుల ఉత్పత్తి సంస్థ ప్రతినిధులు, అభ్యుదయ రైతులు, స్టార్టప్ విభిన్న రంగాల్లో అభివృద్ధి చూపే వ్యక్తులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులు, ప్రజలు, మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించే దిశలో పనిచేసే వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు భాగస్వామ్యంతో కూడిన మూడు బృందాలను విజయవాడ పంపడం జరుగుతుందని పేర్కొన్నారు. అదే విధంగా జిల్లా స్థాయిలో కూడా ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో ఆమేరకు ఏర్పాట్లు చెయ్యాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యులను, శాసన మండలి సభ్యులను, శాసన సభ్యులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమంకి హాజరు కాలేని ప్రజా ప్రతినిధులు జిల్లా స్థాయి కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉందని, ఆమేరకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. అదే విధంగా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను మునిసిపల్ కమీషనర్ లు, తహశీల్దార్లు ఆహ్వానించాలన్నారు. ఈ ఇన్విటేషన్లు ప్రతి ఒక్కరికి వాట్సాప్ ద్వారా అందచేసి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు. రెవిన్యూ, ప్లానింగ్, వ్యవసాయ, జిల్లా గ్రామీణాభివృద్ధి, మునిసిపల్, విద్యాశాఖ, పరిశ్రమలు తదితర శాఖల అధికారులు సమన్వయం చేసుకోవడం ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని కలెక్టరు పేర్కొన్నారు.

# కలెక్టరేట్ లో జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశం.




**జాయింట్ కలెక్టర్ టి నిషాంతి అధ్యక్షతన.**

**అమలాపురం , పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్,డిసెంబర్ 12:** ప్రాథమిక వ్యవసా య సహకార పరపతి సంఘాలు బహుళ ప్రయో జనకరంగా ఉన్నప్పుడే మరింత శక్తివంతంగా ఆర్థికంగా లాభదాయకం గా రూపాంతరం చెంద గలవని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషా%శీ%తి అన్నా రు. గురువారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశం జిల్లా జాయిం ట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా సహకార అభివృద్ధి కమిటీ, సంయుక్త వర్కింగ్ కమిటీ జిల్లాస్థాయి అమలు కమిటీల సమావేశం సభ్యులతో నిర్వహించి పలు అభి వృద్ధి అంశాలపై సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా లు కంప్యూటరై జేషన్ ప్రక్రియ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశిం చారు. అదేవిధంగా సహకార సంఘాలలో ఇతర వ్యాపా రాలు అయిన పెట్రోల్ బంకులు నిర్వహణ జలజీవన్ మిషన్ కింద త్రాగునీటి పైపులైన్లు ఏర్పాట్లు జన ఔషధీ కేంద్రాల నిర్వహణ, కామన్ సర్వీస్ కేంద్రాలు రైతుల కొరకు అమలు చేయాలని ముమ్మిడివరంలో బహుళార్థ మల్టీపర్పస్ ప్రయోజన గోదామును నిర్మాణాన్ని పూర్తి చేసి ఆ యొక్క వసతులు ఈ నెలా ఖరు నాటికి అందుబాటు లోకి తేవాలన్నారు. ప్రాథమిక సహకార సంఘాల ఆర్థిక బలోపేతం దిశగా ప్రభుత్వ పటిష్ట మైన చర్యలు చేపట్టిం దని తెలిపారు. మత్స్య , పశు సంవర్ధక విభాగాలలో మల్టీప ర్పస్ సంఘాలను ఏర్పాటు చేయాలని అదేవిధంగా పాల ఉత్ప త్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయాలని సూచిం చారు నూతనంగా మల్టీప ర్పస్ సహకార సంఘాలను ఏర్పాటు చేస్తూ వివిధ రంగా ల ఆర్థిక ప్రగతికి చేయూత నిందించాలని ఆదేశించారు. ప్రాథమిక వ్యవసాయ సహ కార సంఘాల ఆదాయ వనరులు పెరగడంతోపాటు పాడిపరిశ్రమ, చేపల పెంపకం, నిల్వ వంటి బహుళక ప్రయో జనకర కొత్త రంగాల్లో కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తా యన్నారు. కంప్యూటరీకరణ ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు బలోపే తం కానున్నాయన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా లను నాబార్డుతో అనుసంధానం చేసి డిజిటలైజేషన్, సపోర్ట్ సిస్టమ్స్ నేషనల్ ఇంటిగ్రేటెడ్ సాఫ్ట్వేర్ ను నాబార్డు రూపొం దించిందన్నారు. దీనివల్ల ప్రాథమిక వ్యవసాయ సహ కార సంఘాలలో సమర్ధత ఆన్లైన్ సేవలు అందుబా టులోకి వస్తాయన్నారు. బ్యాంకుల మాదిరిగా సహ కార సంఘాలను డిజిటలై జేషన్ చేసి అక్రమాలకు చెక్ పెట్టాలన్న లక్ష్యంతో సంఘా లలో సాంకేతిక సేవలను అందుబాటులోనికి తేవడం జరుగుతోందన్నారు.సహకార సంఘాల ఆర్థిక స్థితిగతు లను మెరుగుపరచడానికి ఆర్థిక చేయూతను అం దించాలన్నారు.ప్రాంతీయ అసమతుల్యతలను తొలగించి వ్యవసాయ అనుబంధ రంగాలలో సహకార అభివృద్ధిని వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ, సభ్యులు నాబార్డ్ డీజీఎం స్వామి నాయుడు జిల్లా వ్యవసాయ అధికారి వి బోసుబాబు ఏడి మార్కెటింగ్ కె విశాలాక్షి డిసిసిబి సీఈవో రామచంద్రరావు పశు సం వర్ధక శాఖ సహాయ సంచాల కులు విజయ రెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సీఈవోలు తదితరు లు పాల్గొన్నారు

# ఎయిర్ బస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి

**గోపాలపురం పెన్ పవర్ డిసెంబర్ 12:** గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు రాజమహేంద్రవరం బూరుగుపూడి విమానాశ్రయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎయిర్ బస్ సర్వీస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గురువారం పాల్గొన్నారు. రాజమహేంద్రవరం నుండి ఢిల్లీ వెళ్లే ఎయిర్ బస్సు సర్వీస్ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం నుండి దేశ రాజధాని ఢిల్లీకి నేరుగా ఎయిర్ బస్సు సదుపాయం ఏర్పాటు చేయడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టంగా అభివర్ణించారు. ఆయన వెంట రాజమహేంద్రవరం ఎంపీ, ఆంధ్ర రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, కాకినాడ ఎంపీ టి. ఉదయ్ శ్రీనివాస్, గోపాలపురం రాజమండ్రి శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు, ఆదిరెడ్డి వాసు, రూడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, పలువురు ఎమ్మెల్యేలు, విమానాశ్రయంకు సంబంధించిన అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# మద్యం మత్తులో ఏఎన్ఎం భర్త వీరంగం పై విచారణ...

**అనపర్తి,పెన్ పవర్,డిసెంబర్ 12:**అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలో వెల్ నెస్ సెంటర్ వద్ద మద్యం మత్తులో ఏఎన్ఎం గుత్తుల ఈశ్వరి భర్త లోవరాజు సృష్టించిన వీరంగం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన మణికంఠ రెడ్డి అనే వ్యక్తి తన కుమార్తె కు సంబంధించి విటమిన్ డ్రాప్ లు వేయించడానికి వెళ్లిన ఆయనపై ఏఎన్ఎం భర్త లోవరాజు చేసిన వీరంగాన్ని గ్రామ సర్పంచ్ కర్రి బుల్లి మోహన్ రెడ్డి ఇతర పెద్దలకు తెలియజేయడంతో ఈ విషయం కాస్త జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్ళింది. తొలిత జరిగిన విషయాన్ని కుతుకులూరు పిహెచ్సి వైద్యాధికారికి ఫోన్ ద్వారా సమాచారం చెప్పేందుకు సర్పంచ్ బుల్లి మోహన్ రెడ్డి శతవిధాల ప్రయత్నం చేసినప్పటికీ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో విధి లేని పరిస్థితుల్లో జిల్లాకి ఫిర్యాదు చేయడం జరిగింది. డిఎం అండ్ హెచ్ ఓ స్పందించి సంబంధిత కుతుకులూరు వైద్యాధికారిది ఫోన్ చేసిన వెంటనే ఆయన లిఫ్ట్ చేయడం విషయాన్ని చెప్పడం జరిగింది. డీఎం అండ్ హెచ్ ఓ ఫోన్ తో కదలికి వచ్చిన కుతుకులూరు పిహెచ్సి వైద్యులు దుర్గాప్రసాద్ సర్పంచ్ బుల్లి మోహన్ రెడ్డి కి ఫోన్ చేసి విషయాన్ని తెలుసుకున్నారు. ఆ విషయంపై ప్రాథమిక సమాచారాన్ని డిఎం అండ్ హెచ్ ఓ కి నివేదికగా గురువారం గ్రామానికి వెళ్లి సీసీ కెమెరాలు పుట్టేసాధారంగా విచారణ జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాలంటూ ఆదేశించడంతో డాక్టర్ దుర్గాప్రసాద్ గురువారం గ్రామంలో విచారణ నిర్వహించారు. కొప్పవరం గ్రామానికి చెందిన మణికంఠ రెడ్డి అనే వ్యక్తి తన కుమార్తెకు విటమిన్ డ్రాప్స్ వేయించుటకు సిబ్బంది అందుబాటులో ఉన్నారా లేదా అనే సమాచారం కోసం బుధవారం ఉదయం స్థానిక వెల్ నెస్ సెంటర్ కి వెళ్ళాడు. ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్న ఏఎన్ఎం భర్త తన పట్ల అనుచితంగా వ్యవహరించి దుర్భాషలాడి దౌర్జన్యానికి ప్రయత్నించాడని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు డాక్టర్ దుర్గాప్రసాద్ గురువారం విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుని మరియు వెల్నెస్ సెంటర్ సిబ్బందిని ప్రక్కనే గల సచివాలయం సిబ్బందిని ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనకు సంబంధించి రికార్డు అయిన సీసీటీవీ ఫుటేజిని కూడా ఆయన పరిశీలించారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కర్రి బుల్లి మోహన్ రెడ్డి మాజీ సర్పంచులు తాడి వెంకట రామకృష్ణారెడ్డి తాడి సూరారెడ్డి ఎంపిటిసి సభ్యులు పోతంశెట్టి మంజు కృష్ణారెడ్డి ఉప సర్పంచ్ మల్లిడి వీర రాఘవరెడ్డిలు విచారణ అధికారిని కలిసి గతంలో ఎప్పుడూ గ్రామంలో ఇటువంటి సంఘటనలు జరగలేదని ఇటువంటి ఘటనలు తిరిగి పనరావృతం కాకుండా వైద్యశాల ఔన్నత్యాన్ని నిలిపేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



# వైభవోపేతంగా మదన గోపాల స్వామి వార్షిక దివ్య కళ్యాణం





**అనపర్తి,పెన్ పవర్, డిసెంబర్ 12.**మండలంలోని పొలమూరులో వేంచేసియున్న రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాలు శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమ విధానంలో ఆలయ బ్రహ్మ వాడపల్లి వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు పవనకుమార్ ఆచార్యులు, ఆలయ అర్చకులు వంశీకృష్ణ, పండితులు గౌతమ్, సాకేత్ కల్యాణ క్రతువు జరిపించారు. ముందుగా విశ్వక్షేణ ఆరాధన, మండపారాధన, అంకురార్పణ , హోమ కార్యక్రమాలు అనంతరం ధ్వజారోహణ జరిపించారు. గ్రామానికి చెందిన సత్తి సత్యనారాయణరెడ్డి వరలక్ష్మి కుటుంబసభ్యులు కళ్యాణ కర్తలుగా వ్యవహరించారు. అనంతరం మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు తో స్వామి కళ్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ఏవో ఎస్ శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. వార్షిక కల్యాణ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 15 వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటలకు చక్రస్నానం, పూర్ణాహుతి, ధ్వజావరోహణం , మధ్యాహ్నం 2 గంటలకు గ్రామోత్సవం , అదేవిధంగా 16 వ తేదీ సోమవారం రాత్రి 7 గంటలకు శ్రీ పుష్పయాగంతో కళ్యాణోత్సవాలు పూర్తికానున్నట్టు ఆలయ ఏవో శ్రీనివాస్ తెలిపారు.

# గ్రామ స్థాయిలో భూ వివాదాల పరిష్కారానికి వేదిక రెవెన్యూ సదస్సులు-ఆర్డిఓ రాణి సుస్మిత





**కొవ్వూరు, పెన్ పవర్, డిసెంబర్ 12:** గ్రామస్థాయిలో భూ వివాదాల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఉపయోగపడతాయని కొవ్వూరు ఆర్డిఓ రాణి సుస్మిత అన్నారు. దొమ్మేరు గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సులో సుస్మిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో సుస్మిత మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో భూ వివాదాలను తగ్గించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ఎలాంటి రుసుము ఉండదని తెలిపారు. సమస్యల పరిష్కార మార్గం కోసం మండల కేంద్రంలో అందుబాటులో ఉంటామని, ఎప్పుడైనా వచ్చి మీ అర్జీ ఇవ్వవచ్చు అని పేర్కొన్నారు. వ్యయ ప్రయాసలతో రాజమండ్రి కలక్టరేట్ కు రావడం జరుగుతోందని, ఇకపై ఇక్కడే మీ అర్జీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 33 రోజుల్లో భూ వివాదాలు కొలిక్కి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వివిధ అర్జీల పరిష్కారాన్ని రోజువారీగా పరిశీలన చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కార చర్యలు తీసుకున్నట్లు బాధితులకు తెలుగులోనే రసీదు, తిరుగు సమాధానం ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ స్థాయిలో భూ వివాదాల పరిష్కారానికి, 22ఏ, ఫ్రీ హోల్డ్, భూ ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులను, వివిధ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఉపయోగపడతాయని తెలిపారు. మండల స్థాయి అధికారులు రెవెన్యూ సదస్సుల్లో అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని ప్రజలు, రైతులు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటి తహసిల్దార్ ఎం.దుర్గాప్రసాద్, మండల ఎండోమెంట్ ఆఫీసర్ ఎం.సూర్య ప్రకాష్ రావు, రీ సర్వే డిటి ఎస్.కృష్ణ, సర్పంచ్ తానేటి కుమారి, ఎంపీటీసీ హెచ్.సరోజినీ, ఆర్ఐ బి.విశ్వేశ్వరరావు, పెండ్యాల శివ రామకృష్ణ, బాబురావు, కే.పకీర్, విఆర్వోలు టి.సుబ్రమణ్యం, షేక్ హుస్సేన్, కె.వి.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# స్కానింగ్ సెంటర్లలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, డిసెంబర్ 12:**
జిల్లాలోని స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, నియమాలు ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. డిప్యూటీ మాస్ మీడియా అధికారి ఎన్.ఆర్.పి.ఎస్.సత్య కుమార్, టీం సభ్యులు కలిసి రాజమహేంద్రవరంలో ఆర్.ఆర్ స్కానింగ్ సెంటర్, జూపిటర్ స్కానింగ్ సెంటర్, లూసిడ్ మెడికల్ డయాగ్నస్టిక్స్, సుధా స్కానింగ్ సెంటర్ లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్కానింగ్ సెంటర్స్ తనిఖీలలో స్కానింగ్ సెంటర్ల రికార్డులు, నివేదికలు, ఫారం ఎఫ్ లను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్థలింగ నిర్ధారణ చట్టం నిబంధనలను స్కానింగ్ సెంటర్ ల నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని, పాటించని సెంటర్స్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోబడునని, ధరల పట్టికలను ప్రదర్శించాలని సూచించారు. అలాగే స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు పి.సి.పి.ఎన్.డి.టి చట్టంపై అవగాహన కల్పించారు. స్కానింగ్ చేసిన ప్రతి గర్భిణీ స్త్రీ యొక్క వివరాలు సంబంధిత ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని ఆదేశించారు. ఆ వివరాలను నమోదు చేయని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ తనిఖీల్లో ఎంపీహెచ్ఈఓ వెంకట రమణ, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రెవిన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



**జీలుగుమిల్లి, పెన్ పవర్ డిసెంబర్-12:**ఎంతో ప్రతిష్టాత్మకంగా కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులను సద్వి నియోగం చేసుకోవాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఏలూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని జగన్నాధపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో పరిష్కారానికి నోచుకోని అనేక భూ సమస్యలను ఈ సదస్సుల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని సూచించారు. ప్రజలకు మంచి సంక్షేమ పాలన అందించేందుకు కూటమీ ప్రభుత్వం నిత్యం శ్రమిస్తుందని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫైల్ పై రెండవ సంతకం చేసి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశారని అన్నారు. అనంతరం ఆయన ప్రజల నుంచి వివిధ అర్జీలు స్వీకరించి, గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన .గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కొత్త బోరు వేసి, త్రాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, జనసేన పార్టీ సీనియర్ నాయకులు చిర్రి శ్రీను, జిల్లా సంయుక్త కార్యదర్శి మద్దు తేజ, ఇన్చార్జ్ డిప్యూటీ తహసిల్దార్ ఉదయ భాస్కర్, వీఆర్వో తిరుపతమ్మ జమ్మి గోపి, కొర్రి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులు ప్రారంభం..

**అడ్డతీగల, పెన్ పవర్, డిసెంబర్12:** అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలంలో రెవిన్యూ సదస్సులు డిసెంబర్ 13 నుండి జనవరి 5 వ తేదీ వరకు జరుగుతాయని, అడ్డతీగల తాసిల్దార్ కే. సూర్యరావు తెలిపారు. మండలంలో 22 పంచాయితీల్లోనూ, ఈ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆదేశాలను అనుసరిస్తూ, ఈ సదస్సులు నిర్వహిస్తామన్నారు, రెవిన్యూ సదస్సుల ద్వారా భూమికి సంబంధించిన సమస్యలపై రైతులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. విచారణ చేసి నియమ నిబంధనల ప్రకారం సమస్యలు పరిష్కరించబడతాయని తాసిల్దార్ కే. సూర్యరావు తెలిపారు.

# హలో మాల - చలో గుంటూరు తరలిరండి



**జీలుగుమిల్లి, పెన్ పవర్, డిసెంబర్ 12:** ఈనెల 15వ తేదీ ఆదివారం గుంటూరులో తలపెట్టిన మాలల ఐక్య సమ్మేళనం కార్యక్రమానికి మాల సోదరీ, సోదరీమణులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత మాల మహాసంగ్ ఫౌండేషన్ నాయకులు పొడపాటి దుర్గారావు, పైడిమాల కృష్ణ, కుమ్మరపల్లి ప్రకాష్, కొత్తూరు రాజ్ కుమార్ మాల కోరారు. గురువారం దర్భ గూడెం లోని పొడపాటి దుర్గారావు నివాసంలో ఫౌండేషన్ సంఘ సభ్యులు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ హలో మాల - చలో గుంటూరు కార్యక్రమనికి భారీగా మాల సోదరులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీలను వర్గీకరించి వారి ఎదుగుదలను అణిచివేయాలని కుట్ర జరుగుతుందని అన్నారు. వర్గీకరణతో పాటు క్రిమిలేయర్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీలో ఉన్న 59 ఉపకులాలకు ఇది నష్టం జరిగే పరిణామమని అన్నారు. వర్గీకరణ వలన భవిష్యత్తులో తామంతా నష్టపోనున్నామని అన్నారు. ఎస్సీ వర్గీకరణ నిలుపుదల చేయాలని కోరుతూ మాలల ఐక్య సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. అందరూ కలిసి ఒకతాటిపై ఉండి తమ గళాన్ని, జాతి ఐక్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినిపించాలని కోరారు. లక్షలాదిగా మాలలంతా తరలివస్తారని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అర్జా సాగర్, తలారి సతీష్, బొంతు రామకృష్ణ, గుర్రం కాంతారావు, ఎర్రమల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలి

**సీతానగరం, పెన్ పవర్, డిసెంబర్ 12:**సీతానగరం మండలంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేసుకునేలా డి ఈ ఆర్. వెంకటేష్ బాబు, అవగాహన కల్పించారు, 2019 2024 వరకు 1531 ఇల్లు శాంక్షన్ అయినాయని ఇందులో 631 పూర్తి చేశారని ఇంకా ఎనిమిది వందల తొంబై ఇల్లు పూర్తి చేయాలని మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు, ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని, అధికారులు, సిబ్బంది, వర్క్ ఇన్స్పెక్టర్లు అధిక ప్రాధాన్యత ఇస్తూ అంకిత భావంతో పనిచేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, హౌసింగ్ ఇన్ చార్జి ఏఈ. రామారావు, తదితరులు పాల్గొన్నారు,



# కాతేరు గ్రామంలో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల.

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 12.**కాతేరు గ్రామంలో పంచాయతీ వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సు కార్యక్రమానికి రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయిలో భూముల సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, గత ప్రభుత్వ హయాంలో అనేక ప్రభుత్వ స్థలాలను మరియు ప్రైవేటు స్థలాలను కబ్జా చేశారని వాటన్నిటిని ఈ రెవెన్యూ సదస్సులు ద్వారా గుర్తించి అర్హులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ వేదవల్లి, మండల తెదేపా అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ, ప్రత్యేక అధికారి జ్యోతి, ఎమ్మార్వో కుమార్ బాబు, బిక్కిన సాంబశివరావు, గంగిన తిరుమల రావు, గంగిన నాని, గంగిన జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తలకు మంచి గుర్తింపునిచ్చేది బిజెపి మాత్రమే: జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు.

- ఏలేశ్వరం రూరల్ బిజెపి బూత్ కమిటీ అధ్యక్షుల నియామకం.





**ఏలేశ్వరం, పెన్ పవర్, డిసెంబర్ 12:** కార్యకర్తలకు మంచి గుర్తింపునిచ్చేది భారతీయ జనతా పార్టీ మాత్రమేనని కాకినాడ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు అన్నారు. ఏలేశ్వరం మండల రూరల్ పరిధిలోని తూర్పు లక్ష్మీపురం, జె అన్నవరం గ్రామాల్లో బూత్ కమిటీ అధ్యక్షుల నియామకం గురువారం నిర్వహించారు. బిజెపి రూరల్ అధ్యక్షుడు కూరాకుల రాజా అధ్యక్షతన జరిగిన బూత్ కమిటీ నియామకాలకు వెంకటరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ కష్టించి పని చేసే ప్రతి కార్యకర్తను బిజెపి పార్టీ గుర్తిస్తుందని వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తుందన్నారు. ప్రస్తుత భారతదేశ రాజకీయాల్లో బిజెపి ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారతదేశ కీర్తిని, ప్రతిష్టను బిజెపి కాపాడుతుందన్నారు. ప్రధానమంత్రి మోడీ నేతృత్వంలో దేశం అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో ప్రపంచానికే తల మాణికంగా తయారయింది అన్నారు. యావత్ ప్రపంచం భారతదేశ ఆర్థిక అభివృద్ధిని, ప్రగతిని సునిశితంగా పరిశీలిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్లో బిజెపి పార్టీ అభివృద్ధికి కార్యకర్తలంతా కృషి చేయాలని అన్నారు. రూరల్ మండలం రిటర్నింగ్ ఆఫీసర్, ఏ ఆర్ ఓ ఊట వీరబాబు సమక్షంలో జరిగిన నియామకాల్లో జె. అన్నవరం 6వ బూత్ అధ్యక్షునిగా జంగారెడ్డి వీరభద్రరావు, తూర్పు లక్ష్మీపురం 8వ బూత్ అధ్యక్షునిగా మీసాల వీరబాబు, 9వ బూత్ అధ్యక్షునిగా పతివాడ వెంకటేశ్వరరావు లను నియమించి అధికారికంగా ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆంధ్ర రాష్ట్ర పండుగలా సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫి

- లొల్ల లాకుల వద్ద కేరళ స్థాయిలో పడవల పోటీలు
- సంక్రాంతి కంటే ముందే పండుగ వాతావరణం కొనసీమ లో
- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు





**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 12:**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతీ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహిస్తున్నామని, ఆ స్ఫూర్తితో ఆత్రేయపురం మండలం లొల్ల లాకుల వద్ద సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పోటీలు రాష్ట్ర పండుగలా చేపడతామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.గురు వారం లొల్ల లాకుల వద్ద పలు ప్రభుత్వ శాఖలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి అంటే గోదావరి జిల్లాలకు ప్రత్యేక స్థానం ఉంటుందని గుర్తుచేశారు.కానీ సంక్రాంతి కంటే ముందే లొల్ల లాకుల వద్ద పండుగ వాతావరణం నెలకొనేలా గోదావరి ట్రోఫీ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.అందరి సహకారంతో ఈ వేడుకలు నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.రంగవల్లుల పోటీలు,ఈత పోటీలు,పడవల పోటీలు,గాలి పతంగుల పోటీలు మొదలగునవి జరుగుతాయని,కేరళ స్థాయిలో పడవ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీలు నిర్వహిస్తామని బయటి ప్రాంతాల నుండి వచ్చే వారికి,స్థానికులకు పూర్తి స్థాయిలో పండుగ వాతావరణం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని భవిష్యత్తులో లొల్ల లాకులను మంచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని బండారు అన్నారు.

ఈ కార్యక్రమంలోమండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్ ), కరుటూరి నరసింహారావు, ముళ్ళపూడి భాస్కరరావు,తోటకూర సుబ్బరాజు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజమహేంద్రవరంలో నూతన ఎయిర్ బస్సును ప్రారంభించిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, డిసెంబర్ 12:**రాజమహేంద్రవరం విమానాశ్రయం అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని మధురపూడి విమానాశ్రయం నుండి న్యూఢిల్లీ వరకు ప్రయాణించే నూతన ఎయిర్ బస్సును కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి, కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్,
రుడా చైర్మన్ వెంకట రమణ, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, జ్యోతుల నెహ్రూ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, ఎపిడీ ఎస్.జ్ఞానేశ్వర్ లతో కలిసి విమాన నూతన సర్వీసును ప్రారంభించారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి నూతనంగా నేరుగా విమాన సౌకర్యాన్ని కల్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాజమండ్రి ప్రజల చిరకాల వాంఛ అని అన్నారు. ఢిల్లీకి నూతన విమాన సర్వీస్ ప్రారంభ సమయంలో నేరుగా ఢిల్లీ నుంచి ఇక్కడికి వచ్చి మీతో ఈ సంతోషాన్ని పాలుపంచుకొని ప్రారంభించుకోవడం జరుగుతుందన్నారు. ఎన్డీఏ కూటమిలో ప్రధానమంత్రి నేతృత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేస్తూ అభివృద్ధి కోసం ముందుకు నడుస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ లో నూతన ఎయిర్ పోర్టులకు ప్రతిపాదనలు, ఇప్పటికే ఉన్న ఎయిర్పోర్టులకు మౌలిక సదుపాయాలు, విమానాశ్రయాల నుండి ఇతర ప్రాంతాలకు కనెక్టివిటీ ఏర్పాటు చేసి అభివృద్ధి దిశగా సాగుతున్నామన్నారు. స్థానిక ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అభ్యర్థన మేరకు దేశ రాజధాని ఢిల్లీకి ఈరోజు ఎయిర్ బస్ సర్వీసులు ప్రారంభించుకుంటున్నామన్నారు. అదేవిధంగా డిసెంబర్ ఒకటో తేదీన రాజమండ్రి నుండి వాణిజ్య కేంద్రమైన ముంబాయికి నేరుగా విమానయాన సర్వీసు ప్రారంభించుకున్నామని తెలిపారు. రాజమండ్రి పరిసర ప్రాంతాల ప్రజలకు అంతర్జాతీయంగా దూరప్రాంతాలకు ప్రయాణించేందుకు ఈ ఎయిర్ బస్ ఏర్పాటు వలన ఎంతో సమయం ఆదా అవుతుందన్నారు. ఇప్పటికే రాజమహేంద్రవరం నుండి హైదరాబాద్, బెంగళూరు, మద్రాస్ నగరాలకు కనెక్టివిటీ ఉందన్నారు. రాజమహేంద్రవరం మధురపూడి విమానాశ్రయంలో నూతన టెర్మిల త్వరలో ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు. రాజమండ్రి నుండి తిరుపతితో పాటు గుజరాత్ లోని అహ్మదాబాద్, జైపూర్, వారణాసి, షిర్డీ వంటి నగరాలకు కూడా విమాన సౌకర్యాన్ని కల్పించే దిశగా చర్యలు చేపట్టనున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటికే విశాఖపట్నం, తిరుపతి, రాజమండ్రి, విజయవాడ, కడప ఎయిర్ పోర్ట్ ల నుండి నూతన ఎయిర్ బస్సులను ప్రారంభించుకున్నామన్నారు. ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నూటికి నూరు శాతం కృషి చేస్తానన్నారు. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉంటే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలో గత పదేళ్ళలో 158 విమానాశ్రయాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. మరో ఐదు సంవత్సరాలలో దేశంలో 50 నూతన ఎయిర్ పోర్ట్ లను నిర్మించే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలో ఆలోచనలు చేస్తున్నామన్నారు. ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజలు అమెరికా వంటి అంతర్జాతీయ సర్వీస్ లను వినియోగించుకోవాలంటే వారు విశాఖపట్నం, విజయవాడ వెళ్ళవలసిన అవసరం లేదని, రాజమండ్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన న్యూఢిల్లీ, ముంబై సర్వీస్ ద్వారా తమ ప్రయాణ మార్గాలు సులభమై సమయం ఆదా అవుతుందన్నారు. 180 మంది కూర్చుని ప్రయాణం చేసే ఎయిర్ బస్సులు ప్రారంభించుకుంటున్నామని, దీనివలన రెవెన్యూ కూడా పెరుగుతుందన్నారు. దేశంలో చిన్న చిన్న నగరాల్లో కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో ఎయిర్ పోర్ట్ ల్లో అభివృద్ధి జరిగిందన్నారు. డబ్బు కంటే సమయం చాలా విలువైనదని, వ్యాపారవేత్తలు ఎక్కువమంది ఎయిర్ ట్రావెల్ వినియోగిస్తున్నారని చెప్పారు.

రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ మొట్టమొదటి అడుగుగా రాజమండ్రి నుంచి దేశ రాజధాని న్యూఢిల్లీకి నూతనంగా ఎయిర్ బస్ సౌకర్యాన్ని కల్పించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. త్వరలో గోదావరి పుష్కరాలు రానున్న నేపథ్యంలో రాజమహేంద్రవరానికి భారతదేశంలో విమాన సర్వీసులను అవసరమయ్యే ఆవశ్యకత ఉందన్నారు. రాజమహేంద్రవరం నుండి తిరుపతి, వారణాసి, షిరిడి వంటి నగరాలకు విమాన సర్వీసులు ప్రారంభించే దిశగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కృషి చేయాలని ఎంపీ సూచించారు. రాజమహేంద్రవరం ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న నగరం అని, ఈ ప్రాంత వాసులు ఉద్యోగ, వ్యాపార రీత్యా విమాన ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆర్థికంగా బలోపేతం చెందుతుందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వలన అమరావతి అభివృద్ధికి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, రహదారుల మరమత్తులకు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులకు సహకారం కేంద్ర ప్రభుత్వం అందించడం జరుగుతుందన్నారు. నేడు సివిలైజేషన్ మాధ్యమంగా రాష్ట్రానికి ఎంతో సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవి అమరావతికి సంబంధించిన రైల్వే లైన్లు కూడా ఇప్పటికే ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. రాజమండ్రి ఎయిర్ పోర్ట్ నుంచి ఢిల్లీకి నూతన సర్వీసును ప్రారంభించుకునేందుకు అడిగిన వెంటనే అందుబాటులోకి తీసుకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ రాయుడుకి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి, కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, రుడా చైర్మన్ వెంకట రమణ, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామ కృష్ణ, జ్యోతుల నెహ్రూ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, ఎపిడీ ఎస్.జ్ఞానేశ్వర్, ఆర్డీవో కృష్ణనాయక్, ఎయిర్పోర్ట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి గ్రామ రెవెన్యూ సదస్సులు

**వై రామవరం, పెన్ పవర్,డిసెంబర్ 12:** ఈనెల 13వ తేదీ నుండి మండలంలో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని మండల తహసిల్దార్ పీ. వేణుగోపాల్ తెలిపారు.

రెవెన్యూ సదస్సులో ఐదు కేటగిరీలో ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సులో భూ కొలతల్లో తేడాలు, సర్వే నెంబర్లు మార్పులు,వారసత్వం పేర్లు నమోదు, సరిహద్దు సమస్య, భూ విస్తీర్ణం తేడాలు ఉన్నట్లయితే ఈ సదస్సులో ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. మ్యూటేషన్లు , కౌలు రైతులకు కార్డులు, భూమి వివాదాలు, భూ ఆక్రమణలు, నిషేధ జాబితా 22(ఏ) రిజిస్టర్ నిర్వహించాలన్నారు. ఈనెల 13వ తేదీ నుండి జనవరి 8వ తేదీ వరకు మండలంలో గ్రామ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, రెవెన్యూ సిబ్బంది పాల్గొనడం జరుగుతుందని తాసిల్దార్ వేణుగోపాల్ తెలిపారు.



## జిల్లాలో యాదవ సంఘం బలోపేతానికి చర్యలు



**కాకినాడ, పెన్ పవర్ డిసెంబర్ 12 :** కాకినాడతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో యాదవ సంఘాన్ని బలోపేతం చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా యాదవ సంక్షేమ సంఘం వ్యవస్థాప అధ్యక్షుడు యనమల కృష్ణుడు పేర్కొన్నారు.గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కుండల సాయి కుమార్ యాదవ్,అతని మిత్రులను కాకినాడలోని కుండల స్వగృహంలో కలిశారు.కాకినాడ వచ్చిన కృష్ణుడికి సాయికుమార్ శాలువతో సత్కరించారు.

ఈ సందర్భంగా కృష్ణుడు, సాయికుమార్ కొంతసేపు ముట్టడించారు. జిల్లాలో యాదవ సంక్షేమ సంఘానికి, అభివృద్ధికి తగు చర్యలు చేపట్టాలన్నారు. త్వరలోనే భారీ ఎత్తున సభ నిర్వహించి యాదవుల అభివృద్ధికి మార్గదర్శకాలు విడుదల చేస్తామని వారు చెప్పారు. కుండల సాయి వెంట యాదవ సంఘం నాయకులు కుండల హేమంత్, మన్నే నాగేశ్వరరావు, నంబారి రమ, శీను యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ సెజ్, సీపోర్టులను బెదిరించి లాక్కున్నారు



**రైతులకు టీడీపీ ద్వారానే న్యాయం**
**మాజీ ఎమ్మెల్యే వర్మ**

**కాకినాడ, పెన్ పవర్ డిసెంబర్ 12 :** తుపాకులు చూపించి బెదిరించి భయపెట్టి కాకినాడ సెజ్, సీపోర్టులను వాటాలుగా విభజించి మాజీ సీఎం వైఎస్ జగన్ తన బినామీలకు ధారాదత్తం చేసి రైతులకు అన్యాయం చేశారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అప్పటి వైసీపీ పాలనపై విరుచుకుపడ్డారు. సెజ్ కోసం సేకరించిన సుమారు 2000 ఎకరాల డీ నోటిఫికేషన్ భూమిలో 14 ఎకరాల భూమిని అప్పటి మంత్రి, తుని ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా కొనుగోలు చేసింది వాస్తవం కాదా అని వర్మ ప్రశ్నించారు. తమ టీడీపీ ప్రభుత్వం రైతులకు పెట్టేదే గాని వారిని దోచుకునేది కాదని వారిపై మండిపడ్డారు.గురువారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో కాకినాడ సెజ్, సీపోర్ట్ గురించి తమ కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆయన ఖండించారు.తమ ప్రభుత్వం రైతులకు ఏ విధంగా న్యాయం చేసిందో, చేయనుందో తెలియజేసేందుకు వైసీపీ నేతలైన దాడిశెట్టి రాజా,వంగా గీత, కురసాల కన్నబాబులకు ఛాలెంజ్ చేశానని అయినా వారు దాన్ని స్వీకరించలేదన్నారు.సెజ్ రైతులకు ఎకరాకి 10 లక్షలు పరిహారం ఇస్తే చాలని అప్పటి మంత్రి రాజా సమక్షంలో జీవోను రిలీజ్ చేశారని ఇప్పుడు దానిపై ఆయన గగ్గోలు పెట్టడం ఏంటంటూ ప్రశ్నించారు. సెజ్ రైతుల భూములను దాడిశెట్టి లాంటివారు చాలామంది దోచుకున్నారని వారందరినీ వెలికి తీస్తానని వర్మ చెప్పారు.యనమల మంత్రిగాను తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అమ్మిన భూములకు సుమారుగా 8వేల ఎకరాలకు గాను 160 కోట్లు ఇచ్చిన ఘనత అప్పటి సీఎం చంద్రబాబు అని చెప్పారు. టీడీపీ, చంద్రబాబు ఎల్లప్పుడు రైతుల పక్షపాతిగా ఉంటామని త్వరలోనే రైతులకు పరిహారం ఇచ్చేందుకు కమిటీ ఏర్పాటు చేసి దోషులను శిక్షించి రైతులకు న్యాయం చేస్తామన్నారు అలాగే అరవిందో కాలుష్యం నుంచి మత్స్యకారులను ఆదుకుంటామని చెప్పారు. సెజ్, సీపోర్ట్ ఏ విధంగా జగన్ రెడ్డి అండ్ గ్యాంగ్ దక్కించుకున్నారో తాను చెప్పేందుకు వర్మ సిద్ధమన్నారు. ఐదేళ్లు మంత్రిగా రాజా నిద్రపోయి నేడు రైతులపై కపట ప్రేమ, కన్నీళ్లు కార్చడం రైతులు గ్రహించాలని చెప్పారు. తమ టిడిపి ప్రభుత్వం పై తప్పుడు ప్రచారం ఆపాలని లేనిపక్షంలో ఇంకా ఎంతమంది బినామీ దారులు రైతుల భూములు లాక్కున్నారో బహిర్గతం చేస్తానని వర్మ హెచ్చరించారు.

ఈ సమావేశంలో పట్టబద్రుడు ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం,టీడీపీ నాయకులు సత్యానంద రెడ్డి,సూరిబాబు, దావీదు తదితరులు పాల్గొన్నారు.

# సర్వేలు సకాలంలో పూర్తి చేయాలి

- ఎంపీడీవో రామకృష్ణ



**గంగవరం, పెన్ పవర్, డిసెంబర్ 12:**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పలు సర్వేలను సకాలంలో పూర్తిచేసి నివేదికలను సిద్ధం చేయాలని ఎంపీడీవో పి జి రామకృష్ణ ఆదేశించారు .గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ పి సి ఐ ఎల్ ఆధార్ అనుసంధానం, లైవ్ స్టాక్ సర్వే ,ఎమ్మెస్ ఎం ఇ తదితర సర్వేలను ఉన్నతాధికారులు నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఈ నెల 16న నిర్వహించనున్న జీపీడీపీ శిక్షణా తరగతులు, 17 ,18 తేదీల్లో జరగనున్న స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు శిక్షణ తరగతులకు మండలంలోని సచివాలయం సిబ్బంది సర్పంచులు ఎంపీటీసీలు మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు. ఈనెల 19 నుండి 25 వరకు గ్రామాల్లో పిసా గ్రామ సభలు నిర్వహించాలని ఆదేశించారు.

# నేటి నుండి రెవన్యూ సదస్సులు



- జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ

**గంగవరం /పాడేరు,పెన్ పవర్ డిసెంబరు 12:** ఈనెల 13 వ తేదీ నుండి జనవరి 10 వతేదీ.వరకు జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె.అభిషేక్ గౌడ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.జిల్లాలోని 22 మండలాల్లో 2.969 రెవెన్యూ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతోందన్నారు. గ్రామ సభలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారన్నారు.

భూ సమస్యలు, మ్యుటేషన్లు, ఇతర రెవెన్యూ సమస్యలపై ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కార చర్యలు చేపడతామన్నారు. డివిజన్ స్థాయిలోను,జిల్లా స్థాయిలోను బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.గ్రామస్థాయిలో స్వీకరించిన ఫిర్యాదులను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. తాహాశీల్దారులు, మండల సర్వేయర్లు, వి.ఆర్.ఓలు ఆర్.ఐ.లు ఇతర రెవెన్యూ సిబ్బంది,అటవీ శాఖ అధికారులు రెవెన్యూ సదస్సులకు హాజరు కావాలన్నారు.జిల్లా స్థాయి అధికారులు రెవెన్యూ సదస్సులలో పాల్గొంటారని పేర్కొన్నారు.రెవెన్యూ సదస్సులకు మండల ప్రత్యేకాధికారులను నియమించామని చెప్పారు. డివిజన్ స్థాయిలో సబ్ కలెక్టర్ నియమించడం జరిగిందన్నారు. మొత్తం రెవెన్యూ సదస్సులను జాయింట్ కలెక్టర్ పర్యవేక్షింస్తారని చెప్పారు. మ్యుటేషన్ల ప్రక్రియను ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. మ్యుటేషన్లకు ఎటువంటి ఫీజులు, డబ్బులు చెల్లించవలసిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రజలు రెవెన్యూ సదస్సులకు హాజరై భూ సమస్యలను పరిష్కరించు కోవాలని కోరారు.

# ఇంటర్నేషనల్ స్థాయి గీతా ఆన్లైన్ టెస్ట్లో నేతాజీ విద్యార్థులు ప్రతిభ.



**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 12:**ఇటీవల ఇంటర్నేషనల్ స్థాయిలో జరిగిన గీతా ఆన్లైన్ టెస్ట్లో నేతాజీ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ తుమ్మా శ్రీనివాసరావు తెలిపారు. విజేతలుగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులైన కర్రా లక్ష్మీ దుర్గ, కె.సుభాష్ లను ఆయన ఆధ్వర్యంలో గురువారం పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్నేషనల్ స్థాయిలో భారత్ టాలెంట్స్, అను స్వచ్ఛంద సంస్థ స్థానిక గీత సమాజం ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక యువజన అవార్డు గ్రహీత, లండన్ ఫిజియోథెరపిస్ట్ మోదిత్ ముఖ్య అతిథిగా సీతల కళ్యాణ శతసేవా వేడుకలలో భాగంగా ఈ టాలెంట్ టెస్ట్ ర్యాలీలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఇది ఇంటర్నేషనల్ స్థాయిలో 10 దేశాలకు చెందిన 58 మంది విద్యార్థులను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయగా ఈ ఆన్లైన్ టెస్ట్లో వారంతా పాల్గొన్నారని ఆయన తెలిపారు. ఇప్పటికే నవోదయ వంటి టాలెంట్ టెస్టుల్లో మా స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ సీట్లు సాధిస్తూ వస్తున్నారని ఆయన తెలిపారు. అలాగే విజేతలను పలువురు ప్రముఖులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నేడు మండల పరిషత్ సమావేశం

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 12:**తాడేపల్లిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరుగుతుందని ఎంపీడీవో విశ్వనాథ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు , మండల పరిషత్ పరిధిలోని అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. మండల పరిషత్ అధ్యక్షురాలు శేషు లత అధ్యక్షతన జరిగే సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరములో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## జెఎన్టియూకె లో ది ఇండియన్ కాన్స్టిట్యూషన్ 1950-2025 అనే అంశంపై ఒక్క రోజు వర్క్ షాప్






**కాకినాడ. పెన్ పవర్ డిసెంబర్ 12 :**జేఎన్టీయూ ఎస్సీ ఎస్టీ సెల్ లైజన్ ఆఫీస్ ఆధ్వర్యంలో ది ఇండియన్ కాన్స్టిట్యూషన్ 1950-2025 అనే అంశంపై జేఎన్టీయూకే అనుబంధ కళాశాలల విద్యార్థులకు ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. జేఎన్టీయూకే ఎస్సీ ఎస్టీ లైనింగ్ ఆఫీసర్ ఎం కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నార్త్ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కామన్వెల్త్ కరేబియన్ నుండి కే కృష్ణమోహన్ ముఖ్య వక్తగా పాల్గొనగా అతిథులుగా రిటైర్డ్ ప్రొఫెసర్ జి అబ్బయ్య యూసీఈకే ప్రిన్సిపల్ ఎన్ మోహన్రావు విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి. సత్యనారాయణ హైదరాబాదు నుండి సోషల్ యాక్టివిటీ గాయకులు మాస్టర్ జీలు విచ్చేశారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ కే కృష్ణమోహన్ మాట్లాడుతూ గత 75 ఏళ్లుగా భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా విరాజిల్లు తుందన్నారు.భారత రాజ్యాంగం ప్రపంచంలోని ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తుంది అన్నారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా ఉండడానికి రెండు కారణాలు ఉన్నాయని అవి భారత రాజ్యాంగంలోని అని నియమాలను చట్టాలను గౌరవిస్తు న్న భారతదేశ పౌరులు, భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని పేర్కొన్నారు. అనేక సమూహాలతో సామాజిక ఆర్థిక సంస్కృతితో కూడిన సమాజం భారతదేశం అని అన్నారు.భారత దేశ పౌరులకు విద్యతో పాటు భారత రాజ్యాంగాన్ని అర్థం చేసుకునే హక్కు నైతిక బాధ్యత ఉందన్నారు. భారత రాజ్యాంగం విద్యా హక్కు తో పాటు ఇతర సామాజిక అవసరాలను పరిగణలోకి తీసుకొని ప్రజలందరినీ సమానంగా చూడాలని పేర్కొంటుదన్నారు. ఇన్చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థిగా మనం ఎంత చదివిన సమాజం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండడంతో పాటు భారత రాజ్యాంగం గురించి తెలుసుకోవాలన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని భారత సుప్రీంకోర్టు ఇంజనీరింగ్ సిలబస్ లో కూడా భారత రాజ్యాంగాన్ని ఒక పాఠ్యాంశంగా చేర్చాలని సూచించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు స్పెషల్ ఆఫీసర్లు ఇసీఈకే ప్రిన్సిపల్ అధ్యాపకులు జేఎన్టీయూకే, కిట్స్ కళాశాల, ఐడియల్ ఇంజనీరింగ్ కాలేజీ, వివిఎస్ఎం ఇంజనీరింగ్ కాలేజ్, పైడా ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 12 :** జగ్గంపేట నుండి కాట్రావులపల్లి వచ్చే 33 కేవీ లైన్ పై చెట్లు కొమ్మలు తొలగించడం వల్ల శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. కాట్రవులపల్లి, సూరంపాలెం, సీతానగరం, యర్రంపాలెం గ్రామాలకు మరియు అగ్రికల్చర్ బోర్లకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగ దారులు అందరూ సహకరించాలని కోరారు

## ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన





**కాకినాడ పెన్ పవర్ డిసెంబర్ 12 :**కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వుల మేరకు కాకినాడ ఎస్డిపిఓ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో,కాకినాడ ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ ఎన్.రమేష్, ట్రాఫిక్-2 ఇన్స్పెక్టర్ డి.రామారావు, ఎస్సై ఆర్.వెంకట రత్నం ట్రాఫిక్

ఆర్ఎస్సై వల్లిబాబా ఐడియల్ కాలేజ్ ఆఫ్ సైన్స్ ఆర్ట్స్ నందు, విద్యార్థిని విద్యార్థులకు, రోడ్డు ఆక్సిడెంట్స్ ట్రాఫిక్ రూల్స్ పైన, సైబర్ నేరాలు గురించి అవగాహన కార్యక్రమము నిర్వహించినారు.

ట్రాఫిక్ రూరల్స్ పై అవగాహనలో భాగంగా మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయరాదని. వాహనములను అతి వేగముగా నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన కలుగు ప్రమాదాలు గురించి వారికి వివరించారు.ద్విచక్ర వాహనం నడుపు ప్రతి ఒక్క విద్యార్థి, స్టాఫ్ వారి కుటుంబ సభ్యులు అందరు విధిగా హెల్మెట్ ధరించి వాహనము నడపాలని పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించారు.తదుపరి

సైబర్ నేరలలో భాగంగా ఆన్లైన్ మోసాలు,ఫేక్ లోన్స్ మోసాలు,

ఆన్లైన్ జాబ్స్/వర్క్స్ ,డిజిటల్ అరెస్టు,112, 1930, 1972 కాల్స్ యొక్క ఉపయోగములు గురించి వివరించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# అలరించిన "గజల్ శ్రీనివాస్" గానం..





**అనపర్తి,పెన్ పవర్,డిసెంబర్ 12:**ఎన్నిసార్లు పిలిచినా గోవిందుడు రాడేమిటి అంటూ భగవంతుని ఆరాధించే మార్గాన్ని... బిడ్డలపై తల్లికున్న వాత్సల్యాన్ని ప్రేమను చూపే తీరును, పిల్లల ఎదుగుదల కోసం అభివృద్ధి కోసం తండ్రి పడే తపనను తెలుపుతూ ఆలపించిన శ్రీనివాస్ గజల్స్ అందరిని ఆలోచింపచేసేలా సాగాయి. అనపర్తి మండలం పాలమూరులో ప్రముఖ పరిశ్రామికవేత్త సత్తి శ్రీనివాసరెడ్డి సామాన్య మధ్యతరగతి ప్రజల కోసం "శ్రీనివాసమ్"పేరుతో నిర్మించిన మినీ కళ్యాణ మండప ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాస్ ఆహుతులను ప్రముఖులను అలరించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా హాజరైన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పాండిచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి, ప్రముఖ నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డిలు మాట్లాడుతూ సమాజం హితం కోరి శ్రీనివాసరెడ్డి ఇటువంటి నిర్మాణాలు సేవా కార్యక్రమాలతో మమేకమవుతూ మరింత అభివృద్ధి పదం వైపు ఆయన సేవలు సాగాలని ఆశీర్వదించారు. సంధాన కర్తగా వ్యవహరించిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీనివాసరెడ్డి దంపతులను ఉచిత రీతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు కర్రి వెంకటరెడ్డి, పారిశ్రామికవేత్తలు ఉపేందర్ రెడ్డి, ముకుంద రెడ్డి, ఎర్ర సత్తిబాబు, జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత సత్తి రామారెడ్డి నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

నిర్మించిన మినీ కళ్యాణ మండప ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి

# నీటి సంఘం ఎన్నికలపై సమీక్ష సమావేశం.



**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 12:**నీటి సంఘం ఎన్నికలపై మండల రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ కె.జె.ప్రకాష్ బాబు, ఎంపీడీవో ఏ.రాజు ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 14న జరగబోయే నీటి సంఘం ఎన్నికలకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగా మండల పరిధికి చెందిన నాలుగు నీటి సంఘాలకు, ఒక డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఇందులో మడికి, చొప్పెల్ల, ఆలమూరు, చింతలూరు నీటి సంఘాలు ఉన్నాయన్నారు. ఆలమూరు నీటి సంఘానికి బొబ్బా జయశ్రీ గర్ల్స్ హై స్కూల్, చొప్పెల్ల నీటి సంఘానికి చెముడులంక జడ్పీ హైస్కూల్, మడికి నీటి సంఘానికి నేతాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్, చింతలూరు నీటి సంఘానికి కొత్తూరు గవర్నమెంట్ హైస్కూల్ పోలింగ్ కేంద్రాలుగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో మెహర్ ప్రకాష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పి.పద్మ, రావులపాలెం వ్యవసాయ అధికారి బి.మీనా, రావులపాలెం మండల పరిషత్ ఏవో మంగతాయారు, ఇరిగేషన్ ఏఈ కృష్ణ త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

## హైందవ శంఖారావం విజయవంతం చేయండి



**గంగవరం, పెన్ పవర్, డిసెంబర్ 12:**జనవరి 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వనవాసి కళ్యాణ్ ఆశ్రమం జిల్లా విద్యా ప్రముఖు ఎం శ్రీను పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ఆమదాల బంధ గ్రామంలో సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులంతా హైందవ శంఖారావం విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని హిందూ బంధువులందరూ హాజరుకావాలని కోరారు.

# సినీ నటుడు మోహన్ బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలి.






**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 12:**మీడియాపై దాడి చేసిన సినీ నటుడు మోహన్ బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోనసీమ ఆలమూరు మండల ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆలమూరు పోలీస్ స్టేషన్లో ఎస్సై అశోక్ , తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ సుబ్బరాజులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ విధినిర్వహణలో ఉన్న పాత్రికేయుల పై దాడి చేసి గాయపరచడం హేయమైన చర్యని, మీడియాపై నటుడు మోహన్ బాబు దాడి చేయడం సిగ్గుచేటన్నారు. దాడి జరిగి ఇన్ని రోజులు గడుస్తున్నా మోహన్ బాబు క్షమాపణ కూడా చెప్పలేదన్నారు. రోజురోజుకు జర్నలిస్టులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం సినీనటుడు మోహన్ బాబు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం,పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కోనసీమ ఆలమూరు మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కే పూర్ణారెడ్డి, సెక్రటరీ జి.గోపాలకృష్ణ, ట్రెజరర్ జి. మధు, సభ్యులు వై. ఏసుదాసు, జడ్డా ప్రభాత్,పి.సురేష్ గౌడ్, సిహెచ్.రామారావు,కొలపత్తి సురేష్,ఎస్. నాగబాబు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్రపురంలో ఘనంగా మహా అన్న సమారాధన



**జగ్గంపేట(కిర్లంపూడి), పెన్ పవర్, డిసెంబర్ 12 :** కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయం వద్ద సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్ ఆధ్వర్యంలో గురువారం మహా అన్న సమారాధన నిర్వహించారు. జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్, తుమ్మలపల్లి సాయి చందు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం షష్టి మహోత్సవాలు అనంతరం ఈ మహా అన్న సమారాదాన ఏటా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, పిఠాపురం జనసేన ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, కుడా చైర్మన్ తుమ్మల బాబు, మేడా గురుదత్త ప్రసాద్ తదితర ప్రముఖులు హాజరై సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. అదేవిధంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి దాదాపు 20వేల మంది పైగా భక్తులు హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# గో శాలాలను పరిశీలించిన ట్రై కార్ డైరెక్టర్లు





**గంగవరం, పెన్ పవర్, డిసెంబర్ 12:** గంగవరం మండలం బయ్యనపల్లి పంచాయతీ రామవరం గ్రామము లో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మినీ గోకుల షెడ్ ను రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ లు, పువ్వుల లావణ్య, కూడా రామకృష్ణారావు, అనురాధ లు గురువారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను లబ్ధిదారులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకొని అదనపు ఆదాయాన్ని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ప్రకాష్, కూటమి నాయకులు జనసేన పార్టీ మండల అధ్యక్షుడుకే సిద్ధు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

## హైస్కూల్ ప్లస్ స్కూల్ పేరును జిల్లా పరిషత్ జూనియర్ కాలేజీగా మార్చాలి



**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 12:** స్థానిక రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూను జడ్పీ పిజిటి ఆంధ్రప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్ అసోసియేషన్ కలిశారు. ప్రస్తుతం కొనసాగుతున్న హైస్కూల్ ప్లస్ పేరును జిల్లా పరిషత్ జూనియర్ కాలేజీగా పేరు మార్చాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు బీవీ కామరాజ్ కుమార్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా డిప్లయ్ మెంట్ పై పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను శాశ్వత ప్రాతిపధికన జూనియర్ లెక్చరర్ గా నియమించాలన్నారు. నాలుగు గ్రూపులను ఏర్పాటు చేసి కో ఎడ్యుకేషనల్ కాలేజీ గా మార్చాలన్నారు. గత రెండు సంవత్సరాలుగా ప్రస్తుతం పని చేస్తున్నటువంటి ఉపాధ్యాయుల ద్వారా జగ్గంపేట నియోజకవర్గం అత్యుత్తమైనటువంటి ఫలితాలు సాధించడం జరిగిందన్నారు. ఈ వ్యవస్థ వల్ల పేద బడుగు బలహీన వర్గాలు అయినటువంటి బాలికలు చదువు కొనసాగించడానికి అవకాశం కలుగుతుందన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే నెహ్రూ ప్రభుత్వానికి నివేదిక పంపించి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, ధర్మరాజు, నాని బాబు, సత్యవతి, రాము, లక్ష్మీనారాయణ, తపసం, సూర్యనారాయణ, అచ్చన్న తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దుంప రైతులను యాజమాన్య పద్ధతులు పాటించాలి



**పెద్దాపురం, పెన్ పవర్, డిసెంబర్ 12 :** దుంప సాగు చేసే రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఐసిఏఆర్ -సిటిసిఆర్ఐ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి. జగన్నాథం అన్నారు. మండల పరిధిలోని కట్టమూరు, జె.తిమ్మాపురం గ్రామాల్లో సాగులో ఉన్న దుంప పంటలను ఆయన హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త డాక్టర్ జానకి, ఐసిఏఆర్-సిటిసిఆర్ఐ శాస్త్రవేత్త పి. ప్రకాష్ లతో కలిసి గురువారం పరిశీలించారు. కర్రపెండలం సాగులో విత్తన ఎంపికే కీలకమని, సాగు తొలి దశలో మేలైన విత్తన రకాలను ఎంచుకుంటే లాభదాయకంగా ఉంటుందన్నారు. అలాగే శాస్త్రవేత్తలు సూచించిన విత్తన రకాలను ఎంపిక చేసుకొని మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఈ సందర్భంగా పెద్దాపురం పట్టణ పరిధిలో గల శ్రీ గోపాల్ స్టార్చ్ మిల్లును కూడా వారు సందర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది సిహెచ్ విజయదుర్గ, కె. అమృత వర్షిణి, కె. మంగాజ్యోతి, దుంప రైతులు, ఉద్యానవన విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సౌత్ జోన్ వాలిబాల్ పోటీల్లో ఎంపికైన డిగ్రీ విద్యార్థి.



**అరకులో పెన్ పవర్ 12 :** ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ నియోజకవర్గ మండల కేంద్రం డిగ్రీ కళాశాల విద్యార్థి సౌత్ జోన్ వాలీబాల్ పోటీల్లో ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం గురువారం ఒక పత్రిక ప్రకటనలు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థి బిఏ మొదటి సంవత్సరం చదువుతున్న నాగరాజు సౌత్ జోన్ వాలీబాల్ పోటీలో ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సపాల్ భరత్ కుమార్ నాయక్ తెలిపారు, 18 డిసెంబర్ 2024 నుండి 22 డిసెంబర్ 2024 తేదీన కేరళ రాష్ట్రం కాలికట్ (త్రివేంద్రం) యూనివర్శిటీ లో జరగనున్న సౌత్ జోన్ వాలీబాల్ పోటీల్లో పాల్గొన నున్నాడనీ చెప్పారు. ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ పుష్ప రాజుగారు, స్పోర్ట్స్ ఇంచార్జి నాగబాబు గారు, ఎన్ఎస్ఎస్పిఓ. విజయ లక్ష్మి మేడం, పిడి.అప్పారావు అధ్యాపక బృందం, అభినందించారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**గంగవరం, పెన్ పవర్, డిసెంబర్ 12:**

మండలంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీడీవో పీజీ రామకృష్ణ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో వైద్యాధికారులు, ఏఎన్ఎం లతో గురువారం సమీక్ష నిర్వహించారు.

మండలం లోని 10 సచివాలయాలో పరిధిలో పనిచేసే సచివాలయం ఏఎన్ఎం లు ప్రజల ఆరోగ్య స్థితి గతులు గురించి మరియు గర్భవతులు, చిన్నపిల్లలు మరియు స్కూల్ పిల్లలకు అందించే వైద్య సేవలు గురించి సమీక్ష నిర్వహించారు. మండలం లో గల వికలాంగులకు సంబంధించిన పూర్తి సమాచారం సేకరించవలసింది గా ఆదేశించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రతి రోజూ ముఖ ఆధారిత హాజరు వేయాలని తెలిపారు.


ఈ సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పవన్, ఎంపీహెచ్ఈఓ ఏ ప్రసాద్, పది సచివాలయాల ఏఎన్ఎం లు పాల్గొన్నారు.

# నేటి నుంచి హనుమద్వ్రత పూజలు



**సామర్లకోట, పెన్ పవర్, డిసెంబర్ 12 :** సామర్లకోట - పెద్దాపురం రహదారిలో గల ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఈనెల13వ తేదీ నుంచి హనుమద్వ్రత పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త చంద్రాభట్ల పతంజలిశాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమజ్జయంతి సందర్భంగా 65 అడుగుల ఎత్తుగల ప్రసన్న ఆంజనేయస్వామికి శుక్రవారం ఉదయం సామూహిక వ్రతాలు, లక్ష నాగవల్లీ పత్రి పూజ, హెూమం, నీరాజన మంత్ర పుష్పాలు, దర్బారు సేవ, వివిధ రకాల సుగంధ పుష్పాలు, తమలపాకులతో అభిషేకం నిర్వహించడం జరుగుతుందన్నారు. 14న ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, సుందరకాండ పారాయణ, సాయంత్రం గణపతి హెూమం, నవగ్రహ హెూమం, శత రుద్రీయ హెూమం, నీరాజన మంత్ర పుష్పం, 15న శ్రీదత్త జయంతి సందర్భంగా ఆలయంలో ఉన్న దత్తాత్రేయునికి ఏకాదశ రుద్రాభిషేకం, హెూమం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

# మున్సిపల్ కమీషనర్ పేరుతో ఫేక్ కాల్స్




**పెద్దాపురం, పెన్ పవర్, డిసెంబర్ 12 :** పెద్దాపురం మున్సిపల్ కమీషనర్ పేరుతో ఓ గుర్తుతెలియని వ్యక్తి నుంచి పట్టణంలో దుకాణదారులకు గురువారం ఫేక్కాల్స్ వెల్లువెత్తాయి. వివరాల్లోకి వెళితే పెద్దాపురం పట్టణంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణదారులకు ఓ గుర్తుతెలియని వ్యక్తి సెల్ నంబర్ 7569778380 నుంచి ఫోన్కాల్ చేశాడు. నేను మున్సిపల్ కమీషనర్ మాట్లాడుతున్నా. మీ షాపునకు సంబంధించి ట్రేడింగ్ ట్యాక్స్ పెండింగ్లో ఉంది. వెంటనే ఫోన్పే చేయండి. లేదంటే మా సిబ్బంది వచ్చి మీ షాప్ ని సీజ్ చేస్తారు అంటూ చెప్పడంతో వ్యాపారస్తులు కంగారుపడ్డారు. గతేడాది ట్రేడ్కు సంబంధించి టాక్స్ లు చెల్లించినా మళ్లీ ఎందుకు అడుగుతున్నారని అనుమానం వచ్చి విషయాన్ని వెంటనే మున్సిపల్ అధికారులను ఆరాతీయంతో తాము ఎవరూ ఫోన్ చేయలేదని తెలపడంతో అది ఫేక్కాల్ అని తేలింది. దీంతో అప్రమత్తమైన మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగి పోవడంతో పెద్దాపురం ఎస్ఐ వి. మౌనిక వ్యాపారులను, ప్రజలను అప్రమత్తం చేస్తూ పెద్దఎత్తున అవగాహన కల్పించడంతో ఫేక్ ఫోన్కాల్స్ వ్యవహారంపై అందరూ అప్రమత్తమవుతున్నారు.

# జిల్లాలో ధాన్యం కొనుగోలుకి మిల్లర్లు సహకరించాలని కోరిన జె సి






**అమలాపురం , పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, డిసెంబర్ 12:** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడంలో ప్రభుత్వానికి అన్ని విధాల సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషా%శీ%తి మిల్లర్లను కోరారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లాలోని మిల్లర్ల యజమాన్యాలతో సమావేశం నిర్వహించి గోనెసంచులు సరఫరా, హమాలీల అందుబాటు, మిల్లుల వద్ద ధాన్యం అన్లోడింగ్ లో జాప్యాలు, కనీస గిట్టుబాటు ధరల కల్పన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిల్లర్లు రైతాంగానికి మంచి నాణ్యమైన గోనె సంచులు సరఫరా చేయాలని సూచించారు. ధాన్యం లోడుతో మిల్లులకు చేరే వాహనాలు అన్లోడింగ్ లో జాప్యాలు వివరించాలని ఆయన కోరారు. అవసరమైనంత మంది హమాలీలను వంతుల వారీగా 24/7 నియమించుకోవాలని సూచించారు. అన్లోడింగ్ లో జాప్యాలకు పాల్పడే మిల్లర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అంతిమంగా ఆరుగాల%శీ% శ్రమించి పండించిన ధాన్యానికి ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు ఇప్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతుల నుండి ఫిర్యాదులు మిల్లర్లపై వస్తే సహించేది లేదని ఆమె మిల్లర్లకు సూచించారు. ప్రభుత్వ ధాన్యం యొక్క తేమ శాతాన్ని కొంతమేర సడలించడం జరిగిందని, తేమ శాతం రైతు సేవా కేంద్రంలో నమోదు కాబడిందే ఫైనల్ అని ఆమె స్పష్టం చేశారు. తేమ శాతం పేరున మిల్లర్లు ఎట్టి పరిస్థితులలోనూ ఎటువంటి తరుగులు ధాన్యం కొనుగోలు సందర్భంలో రైతులకు విధించరాదని ఆమె సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను మిల్లర్లు తప్పనిసరిగా ఆచరిస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. సీఎంఆర్ బియ్యం డెలివరీ గోదాముల వద్ద కూడా అవసరాల మేరకు హమాలీలను నియమించుకొని జాప్యాలను నిలువరించాలన్నారు. సాంకేతిక సహాయకులు సీఎంఆర్ డెలివరీ ప్రక్రియను సమర్థవంతంగా తనిఖీ చేయాలని లేని పక్షంలో కఠిన చర్యలు గైకొనడం జరుగుతుందన్నారు. మిల్లర్లు ఏ, బి, రిజిస్టర్లు స్టాక్ రిజిష్టర్లు ధాన్యం కొనుగోలు సీఎంఆర్ డెలివరీ సంబంధిత రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని లేనిపక్షంలో తనిఖీ సందర్భంలో ఇబ్బందులను ఎదుర్కొనవలసి వస్తుందన్నారు. అదేవిధంగా ఎంత పరిమాణంలో ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తున్నారో ఆ యొక్క వివరాలను ప్రాపర్ గా రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. జిల్లాకు రెండు లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని లక్ష్యంగా నిర్ధారించారని ఆమె స్పష్టం చేశారు. కొంతమంది మిల్లర్లు బహిరంగ మార్కెట్లో నేరుగా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని మీరు తప్పనిసరిగా కనీస మద్దతు ధరలు చెల్లించాల్సి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో ఆశాజనకమైన దిగుబడులు వచ్చాయని రైతాంగానికి ధాన్యం సొమ్ములు కూడా నిర్దేశిత 48 గంటలలోపే తమ బ్యాంకు ఖాతాకు జమవుతున్నాయన్నారు. మిల్లర్లకు ఎగుమతుల అవకాశం కూడా కల్పించడం జరిగిందన్నారు. గోనె సంచులు సరఫరాలో తప్పనిసరిగా ఆడిట్ పాటించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ బాల సరస్వతి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ.ఉదయ భాస్కర్, జిల్లా పౌర సరఫరాల శాఖ సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కాకి నాగేశ్వరరావు, మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి సంఘాల ఎన్నికలకు సహకరించండి



**జీలుగుమిల్లి, పెన్ పవర్, డిసెంబర్ 12:** పోలవరం నియోజకవర్గం లోని సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు 7 మండలాల కూటమి మండల నాయకులు సహకరించాలని పోలవరం ఎమ్మెల్యే చి రి బాలరాజు సూచించారు .గురువారం జీలుగుమిల్లిలో జనసేన పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శి గడ్డ మణు గు రవికుమార్ నివాసం వద్ద కూటమి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లా నందు 354 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయని అన్నారు. అయితే పోలవరం నియోజకవర్గం లో నీటి సంఘాల ఎన్నికలకు కూటమి నాయకులందరూ సహకరించి ఎన్నికలకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఏలూరు జిల్లా కార్యదర్శి చాత్రాతి ప్రసాదు, ఏడు మండలాల కూటమి మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి - ఎంపీపీ సత్యనారాయణ





**గోపాలపురం, పెన్ పవర్, డిసెంబర్ 12:** మండల అభివృద్ధికి నాయకులు కార్యకర్తల సమిష్టి కృషి ఎంతో అవసరమని గోపాలపురం ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలుపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, మండల, గ్రామస్థాయి అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీపీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి అన్నారు. కార్యక్రమానికి ముందు మహాత్మా గాంధీ డా. బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేంద్రాన్ని మొదటి రోజు శిక్షణ కేంద్రాన్ని సామర్లకోట రిసోర్స్ సెంటర్ నుండి చక్రపాణి ఏలూరు డిపిఆర్సి నుండి ప్రసంగి రాజు హాజరయ్యి శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పరిశోధనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు ఆన్సర్ భాష, ఇళ్ళ శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత ఆహ్లాదకరంగా భాష్యం విద్యాసంస్థల అంతర్గత క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు.




**అమలాపురం టౌన్ ఫెన్ పవర్ డిసెంబర్ 12**
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జిఎంసి బాలయోగి స్టేడియం నందు రెండు రోజులపాటు నిర్వహించిన క్రికెట్ పోటీలకు భాష్యం పాఠశాలల జోనల్ ఇన్చార్జి జవ్వాది వెంకట శ్రీనివాస్ అధ్యక్షత వహించి కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ పోటీలకు అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, రావులపాలెం, మండపేట, పాలకొల్లు, నరసాపురం, తాటిపాక, మలికిపురం, శాఖల నుండి 270 మంది సీనియర్ మరియు జూనియర్ విద్యార్థులు పాల్గొన్నట్లు వివరించారు.
ఈ పోటీలలో సీనియర్స్ విభాగంలో ముమ్మిడివరం బ్రాంచ్ విన్నర్ అమలాపురం బ్రాంచ్ రన్నర్ గాను జూనియర్స్ విభాగంలో అమలాపురం బ్రాంచ్ విన్నర్ గాను పాలకొల్లు బ్రాంచ్ రన్నర్ గా నిలిచారు,
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అమలాపురం డిఎస్పి టి ఎస్ ఆర్ కె ప్రసాద్ మరియు పెడియాట్రీషియన్ డాక్టర్ కే సత్య రేవతి బహుమతులు ప్రధానం చేశారు.
ఈ కార్యక్రమానికి ఆయా శాఖల ప్రిన్సిపల్స్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.
గెలుపొందిన విద్యార్థులు గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.
విజేతలను భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ అభినందించారు

## చెట్టుపై నుండి జారిపడిన వ్యక్తికి తీవ్ర గాయాలు



**అడ్డతీగల, పెన్ పవర్, డిసెంబర్ 12:** అల్లూరి సీతారామరాజు జిల్లా, అడ్డతీగల మండలం భీముడు పాకలు పంచాయతీ, పింజరకొండ గ్రామంలో మిరియాల. నాగేశ్వరావు 35 సంవత్సరాలుఅనే వ్యక్తి చెట్టు పై నుండి జారిపడగా అతడికి తీవ్ర గాయాలు అయినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా జారిపడిన వ్యక్తిని పింజరకొండ కాలవ దాటి తీసుకురావడానికి చాలా ఇబ్బందికి గురి అయ్యారు. గాయపడిన వ్యక్తి అపస్మరక స్థితిలో ఉండగా, అతనికి గ్రామస్తులు ప్రధమ చికిత్స చేసి పింజరకొండ గ్రామం నుండి డోలిలో మోసుకొని కాలువ దాటించి, కాలువ అవతల గల అంబులెన్స్ లో అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. కాగా గాయపడిన వ్యక్తికి తీవ్ర గాయాలు అవ్వడంతో పాటు చెవి నుండి తీవ్ర రక్తస్రావం కావడంతో, అతడిని రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు అడ్డతీగల మెడికల్ ఆఫీసర్ పండా. సతీష్ తెలిపారు. రిఫర్ చేసిన మిర్యాల నాగేశ్వరావును 108 లో రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## అంగరంగ వైభవంగా గౌరీ సాంబశివ జాతర మహోత్సవం.

- **ఉత్సవ నిర్వహణలో నూతనత్వానికి నాంది పలికిన యువత.**

**ఏలేశ్వరం, పెన్ పవర్, డిసెంబర్ 12:** స్థానిక దిబ్బల పాలెం రామాలయం వద్ద నెలకొల్పిన గౌరీ సాంబశివుల జాతర మహోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించి, గురువారం తెల్లవారుజామున భారీ బాణసంచ కాలుస్తూ
భక్తులు తిమ్మరాజు చెరువు వద్ద శ్రీ గౌరీ సాంబశివులను ఏలేరు కాలువ ప్రవాహంలో నిమజ్జనం చేశారు. వ్యవసాయ కుటుంబాలు గౌరీ దేవి ఉత్సవాలు నిర్వహించడం సుమారు అర్ధ శతాబ్దం నుంచి ఆనవాయితీగా జరుగుతుంది. ఏలేరు రిజర్వాయర్ నిర్మాణానంతరం ఏలేశ్వరం గ్రామం పట్టణంగా అభివృద్ధి చెందింది. దీంతో వ్యవసాయ కుటుంబాలతో పాటు, వ్యాపార సంస్థలు, దిబ్బల పాలెం గ్రామ పెద్దలు ప్రతి ఏటా సాంప్రదాయ బద్ధంగా గౌరీ దేవి ఉత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగానే విజయదశమికి పందిరిరాట వేసి గౌరీ దేవి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. దుబ్బు గౌరమ్మ, గౌరీ సాంబశివుల కళ్యాణం ఉత్సవాలను నిర్వహించడం, ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా జాతర మహోత్సవాన్ని నిర్వహించి ఉత్సవ విగ్రహాలను నిమజ్జనం చేయడం జరుగుతుంది. సుమారు 45 రోజులు పాటు అత్యంత భక్తి ప్రపత్తులతో గౌరీ సాంబశివులను భక్తులు పూజించడం, మొక్కులు తీర్చుకోవడం అనవాయితీగా వస్తుంది. అయితే ఈ సంవత్సరం యువకులు శ్రీ గౌరీ సాంబశివ ఉత్సవ కమిటీ బాధ్యతలు చేపట్టి, నూతనత్వానికి నాంది పలుకుతూ అత్యంత వైభవంగా జాతర మహోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి ఉపవాసం ఉన్న భక్తులు శ్రీ గౌరీ సాంబశివులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర మహోత్సవంలో భాగంగా భక్తుల దర్శనార్థం శ్రీ గౌరీ సాంబశివుల ఉత్సవ విగ్రహాలను పూలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులు ధూప దీప నైవేద్యాలు అందించే విధంగా జాతర మహోత్సవంలో భక్తులకు సౌకర్యం కల్పించారు. జాతర కార్యక్రమంలో తాడేపల్లిగూడెం శక్తి వేషాలు, శ్రీ వెంకట సత్య గౌరీ కోలాట భజన మండలి నృత్య ప్రదర్శన, ఏలేశ్వరం, జగ్గంపేటకు చెందిన బాలికలు శ్రీ సీతారత్న లలిత కళా నృత్య నికేతన్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య కళాకారులు ప్రదర్శించిన రామాయణంలో వివిధ ఘట్టాల రూపక నృత్యాలు జాతరకు ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి. జాతరలో సంస్కృతి సాంప్రదాయాలకు విలువలనుస్తూనే నూతన తరానికి విశాఖపట్నం కు చెందిన
రాము ఈవెంట్స్ ఆర్గనైజర్ ఆధ్వర్యంలో బాలబాలికల డీజే నృత్యాలు సంబరానికి ప్రత్యేక ఆకర్షణ తెచ్చాయి. విద్యుత్ దీపాలంకరణల, రంగురంగుల బాణసంచా కాలుస్తూ నిర్వహింపబడిన జాతర మహోత్సవం కనుల వైకుంఠంగా మారింది. ఒక ప్రక్క సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు, మరో ప్రక్క డీజే శబ్దాలతో జాతర కనుల పండువగా జరిగింది. అత్యంత వైభవంగా దిబ్బల పాలెం యువత శ్రీ గౌరీ సాంబశివ ఉత్సవ కమిటీ బాధ్యతలు చేపట్టి నూతనత్వానికి తెరతీస్తూ అత్యంత వైభవంగా సంబరాన్ని నిర్వహించినందుకు యువతను పలువురు పెద్దలు, భక్తులు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

## ఏకగ్రీవమైన నీటి సంఘం అధ్యక్షుడు శీలం వెంకటేశ్వరరావు





**ముమ్మిడివరం పెన్ పవర్ డిసెంబర్ 12:** ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ఆదేశాలతో అనాతవరం,చెయ్యేరు గున్నేపల్లి, సోమదేవరపాలెం గ్రామాల బ్రాంచ్ కెనాల్ నీటి సంఘం కూటమి అభ్యర్థిగా శీలం వెంకటేశ్వరరావు ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి తీర్మానం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చెయ్యేరు గున్నేపల్లి తెలుగు దేశం పార్టీ గ్రామ అద్యక్షుడు మరియు రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి యాళ్ల ఉదయ్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో అనాతవరం తెలుగు దేశం పార్టీ గ్రామ అద్యక్షుడు కురసాల శివ,వాసంశెట్టి పట్టాభి రామయ్య, బొక్కా త్రిమూర్తులు,గోకరకొండ శ్రీను,పెయ్యిల వెంకటరమణ, బొక్కా నాగరాజు, గంధం శ్రీను, నల్లా ఆండాళ్ దేవి,మట్టపర్తి ఈశ్వరి,దంగేటి పండు,సూదా శ్రీను,మట్టపర్తి రాంబాబు,అందే శ్రీను,చెల్లి శ్రీనివాసరావు, నల్లమిల్లి యేసు,పసుపులేటి రామారావు మరియు కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వద్ది పర్రు గ్రామంలో రెవెన్యూ సదస్సు

**సమస్య పై 14 అర్జీలు నమోదు**




**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 12:** వద్దిపర్రు గ్రామంలో గురు వారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తహశీల్దార్ టి. రాజేశ్వరరావు,ఆత్రేయపురం రెవెన్యూ సదస్సుల ప్రత్యేక అధికారి రామారావు,ఎ డి,ఎన్ ప్రభాకర్ రావు,కొత్తపేట,సబ్ రిజిస్టర్ యం.రత్నకుమార్ , మండల దేవా దాయ శాఖ అధికారి డి.నరేంద్ర ఆధ్వర్యంలో అత్రేయపురం, రెవెన్యూ సిబ్బంది.సర్వేయర్లు పాల్గొన్నారు. గ్రామ సభలో రెవిన్యూ పరమైన సమస్యలు, భూపరమైన సమస్యలు ఇతర సమస్యలపై 14 అర్జీలు నమోదు కాగా అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించుటకు తగు చర్యలు తీసుకొనబడునని తాహశిల్దార్ టి.ఆర్ రాజేశ్వరరావు, తెలియజేశారు.

## సాగునీటి సంఘాలకు 14న ఎన్నికలు

● ఎన్నికల అధికార్లను నియమించిన తహసీల్దార్ ప్రసాద్.



**కొయ్యూరు,పెన్ పవర్ డిసెంబర్12:** ఈ నెల 14న జరగనున్న 8 సాగునీటి సంఘాలకు ఆయా పంచాయితీల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కొయ్యూరు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం లో ఎన్నికల నిర్వహణ పై సంబధిత రెవిన్యూ, ఎన్నికల అధికార్లను నియమించినట్లు ఆయన తెలిపారు. మండల పరిధిలో కించవానిపాలెం (రిజర్వాయర్) తో పాటు గంగవరం, కొయ్యూరు,రామన్నపాలెం, గుడ్లపల్లి, సింగవరం, లుబర్తి, శరభన్నపాలెం, పంచాయితీల పరిదిలో నిర్వహించే సాగునీటి సంఘాలకు మండల స్థాయి ఎన్నికల నిర్వహణ అధికార్లును నియమించి వారితో తగిన ప్రభుత్వ అదేశాలు ప్రకారం నిబంధనలు తో సజావుగా జరపాలని ఎటువంటి ఒత్తిడిలు, వివాదాలకు తావివ్వకుండా జరపాలని ఈ ఎన్నికల అధికార్లుకు జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలలో తెలియజేసినట్లు తహసీల్దార్ ప్రసాద్ వివరించారు. 14 న జరిగే సాగునీటి ఎన్నికలు నిర్వహణకు సంబందించి ఫారం – ఏ, ఫారం – బి విడుదల చేసినట్లు తెలిపారు. మండలపరిధిలో జరిగే 8 సాగునీటి సంఘాలకు 576 మంది ఓటర్లు (రైతులు) ఉండగా వీరిలో 368 మంది పురుషులు,208 మంది మహిళలు తమ ఓటును వినియోగించుకోవాల్సి ఉందన్నారు. ఈ సాగునీటి సంఘాల ఎన్నికల కోసం నియమించిన నోడల్ (ప్రత్యేక) అధికారులుగా మండల స్థాయి అధికార్లు సాయి కృష్ణ (అర్డబ్యూ ఎస్), రాంబాబు (ఎంఈఓ), విజయకుమారి (సిడిపిఓ), కుమారస్వామి (డి టి), గోవింద్ (హౌసింగ్ఏఈ), ఉమాదేవి (ఏఒ), శ్రీవిద్య (ట్రైబల్ వెల్ఫేర్) లను నియమించినట్లు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు.

## అలరించిన దేవీ సుస్వరాలు



**విశాఖ దక్షణం,పెన్ పవర్,డిసెంబర్ 12** :దేవి సుస్వరాలు నీ సంగీత సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రం లో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరిం చింది. కార్యక్రమాన్ని సోషల్ మీడియా స్టేట్ చైర్మ న్ సన్ మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిం చారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఏ శ్రీదే వి నిర్వహణలో జరిగిన ఈ సంగీత విభావరి లో అలనాటి ఆణిముత్యాలను నగరానికి చెం దిన గాయని గాయకులు వినిపించారు. హుషా రైన యుగళగీతాలతో కళాకారులు తమ ప్రతిభ ప్రదర్శించారు. ఈ విభావరి లో గాయని గాయ కులు అమ్మాజీ రావు, ఎన్ వి ఆర్ మూర్తి, సింగ్, సూర్య ప్రకాష్, జగన్మోహన్, అరుణకుమార్, పద్మనాభం, భాగ్యలక్ష్మి, మాధురి, మను,పావ ని, సుజాత,రంజిత, రమణి, యాంకర్ లక్ష్మి స్వరూప, ఆక్వా కన్సల్టెంట్ జి త్యాగరాజు, లెఫ్టినెంట్ లోకేష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా వైయస్సార్ కాంగ్రెస్

● జిల్లా కేంద్రాల్లో నిరసనలు
● గోడపత్రికలు విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే గణేష్




**నర్సీపట్నం, పెన్ పవర్ (డిశెంబర్ 12)** :కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. ఈ నెల 13న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పిలుపుమేరకు నిర్వహించే అన్నదాతకు అండగా వైసీపీ కార్యక్రమం పోస్టర్లను గురువారం ఉదయం క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు తెలుగుదేశం అధికారంలోకి వస్తే రైతు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని చెబితే చంద్రబాబును నమ్మి గెలిపించారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రుణాలు కాదు పంట రుణాలని మాట మార్చారన్నారు. మళ్లీ పంట రుణాలు కూడా కాదు, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అని చెప్పి ఇంట్లో ఒకరికి మాత్రమే మాఫీ చేస్తామని, ఆ ఒకరికి కూడా లక్షా యాభై వేలు మాఫీ చేస్తామని చెప్పారన్నారు. లక్షా యాభై కూడా ఐదు దఫాలుగా ఇస్తామని రైతాంగాన్ని మోసం చేశారన్నారు. కానీ జగన్మోహన్రెడ్డి 2019 ఎన్నికల ముందు అర్హులైన ప్రతీ రైతుకు ఏటా రూ.12500 నాలుగు దఫాలుగా ఇస్తామని చెప్పారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత 12500 చాలదు 13500 ఇస్తామని చెప్పి, ఐదు దఫాలుగా అందించారని గుర్తు చేశారు. 2024 ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.20వేలు ఇస్తామని చంద్రబాబు చెప్పారని, కానీ ఇప్పటికీ ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. దీనికి నిరసనగా రేపు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కలెక్టర్ లకు వినతిపత్రాలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. నర్సీపట్నం నుంచి వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైసిపి నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు, గొలుగొండ జడ్పీటీసీ సుర్ల గిరిబాబు, గొలుగొండ ఎంపిపి గజ్జలపు మణికుమార్, నర్సీపట్నం ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, మాకవరపాలెం మండల నాయకులు రుత్తల సర్వేశ్వరరావు, బయపురెడ్డి గణమ్మ, మాకిరెడ్డి రామకృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 14న నీటి సంఘాలకు ఎన్నికలు




**కాజులూరు,పెన్పవ్,డిసెంబర్12**ఃమండల పరిధిలోని శలపాక, గొల్లపాలెం, పెనుమళ్ల,కాజులూరు,మంజేరు ,కోలంక,పల్లిపాలెం,తదితర గ్రామాల సాగునీటి సంఘాల ఎన్నికలు 14వ తేదీ శనివారం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ఎల్.శివకుమార్ గురువారం మీడియాకు తెలిపారు.ఇప్పటికే నీటి సంఘం ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదలచేసి,ఆయా గ్రామాల సచివాలయాల వద్ద,ఓటర్ల జాబితా విడుదల చేయడం జరగిందని ఎలక్షన్ అధికారి ఆర్.డబ్యూ ఎస్ జేఈ రూప తెలిపారు.మండలంలోని 8 నీటి సంఘాలకు సంబంధించి,అలాగే డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఎన్నిక కూడా అదేరోజు ఎలక్షన్ నిర్వహించడం జరుగుతోందన్నారు.డీసీ కి సంబంధించి కాజులూరు మండల పరిధిలోని ఆరు గ్రామాల నీటి సంఘం డైరెక్టర్లు ఓటు హక్కును కలిగి ఉంటారని పేర్కొన్నారు. కావున 14 వ తేదీన పోటీ చేయాలనుకునే అభ్యర్థులు అదేరోజు ముందుగా నామినేషన్ వేయాల్సి ఉంటుందన్నారు.నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరగిందని ఆర్.ఐ పి.వేగేశ్వరరావు వివరించారు.మండల పరిధిలోని శలపాక, గొల్లపాలెం, మంజేరు, కాజులూరు,పెనుమళ్ల,దుగ్గుదూరు,గ్రామాలు కాజులూరు డీసీ పరిధిలోకి రానున్నాయి. కావున ఎన్నికలు సజావుగా జరిగేందుకు సంబంధిత రైతులు, అభ్యర్థులు సహకరించాలని రెవెన్యూ అధికారులు సూచించారు.శలపాక నీటి సంఘం అధ్యక్షుల రేస్లోను,కాజులూరు డీసీ రేస్లో తాడి రామారెడ్డి పేరు ప్రస్ఫుటంగా వినిపిస్తోంది.అలాగే నీటిసంఘం అధ్యక్షుల రేస్లో పోటీ పడేందుకు గరగ అర్జిబాబు,డేగల బధ్రి,పితాని సూరసేను, పిచ్చుకుల రవికృష్ణ తదితరులు సిద్ధంగా ఉన్నట్లు రైతలు తెలిపిన సమాచారం.ఏది ఏమైన శలపాక నీటి సంఘం ఎన్నికలు రసవత్తరంగా జరగనున్నట్లు మండలంలో హాట్ టాపిక్ నడుస్తోంది.ఎన్నిక ప్రచారానికి సమయంలేదు.దీంతో కూటమి అభ్యర్థులు ఎవరిని గద్దెనెక్కించనున్నారో రైతుల్లో అయోమయం నెలకొంది.ఈ కార్యక్రమంలో వీఆర్వో ఎస్ వి గనికమ్మ, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ కె.సూరిబాబు, తాడి రామారెడ్డి, గోవిందు రెడ్డి,డేగల భద్రి, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి





**కాజులూరు,పెన్పవ్,డిసెంబర్12**ఃమండల పరిధిలోని నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను స్థానిక రైతులు,భూ యజమానులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు ఎల్.శివకుమార్ సూచించారు.గురువారం పల్లిపాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు సంబంధించి వివిధ సమస్యలకు సంబంధించి 14 అర్జీలు రావడం జరిగిందన్నారు.వీటిలో ఎక్సెటెంట్ ఏరియేషన్-3,సబ్ డివిజన్-3,మ్యూటేషన్ -5,పట్టాదార్ నేమ్ కరక్షన్-1,హస్ సైట్-1 మొత్తం 14 మంది అర్జీలు పెట్టడం జరిగింది.వాటిలో కొన్ని సమస్యలను పరిశీలించి పరిష్కరించడం జరిగిందన్నారు.మిగిలినవి కూడ వారికి ఇచ్చిన గడువలోపు పరిష్కరించడం జరుగుతోందని తహశీల్దార్ పేర్కొన్నారు.మీ గ్రామాల్లో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులు తప్పని సరిగా మీ భూ సమస్యలు పరిస్కరించుకోవాలని తహశీల్దార్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వడ్డపాటి భాస్కరరావు,రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శి ,స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కోటిపల్లి సోమేశ్వర స్వామి హుండీ లెక్కింపు.



**కె గంగవరం పెన్ పవర్ డిసెంబర్ 12:** కె గంగవరం మండలం కోటిపల్లి శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం దేవాదాయ ధర్మదాయ శాఖ రామచంద్రపురం ఇన్స్పెక్టర్ ఆర్ బాలాజీ రాంప్రసాద్, కార్య నిర్వహణ అధికారి ఏపీ యువ శంకరం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది లెక్కింపు జరిపారు. తొమ్మిది నెలల కాలానికి హుండీ ఆదాయం 3,28,836/-రూపాయలు వచ్చాయి. గత సంవత్సరం కన్నా 41,121/-రూపాయల ఆదాయం పెరిగిందని ఆలయ ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పప్పుల సాయిబాబు సుభాష్ సేవ సమితి వివిధ ఆలియాల సిబ్బంది పాల్గొన్నారు.

## సోమేశ్వరస్వామి ఆలయం వద్ద పూజ సామాగ్రి విక్రయ షాపుల వేలం.



**కె గంగవరం పెన్ పవర్ డిసెంబర్ 12:** కె గంగవరం మండలం కోటిపల్లి శ్రీ ఛాయా సోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో తాత్కాలిక షాపులను ఏర్పాటు చేసుకుని కొబ్బరికాయలు, పూజ సామాగ్రి అమ్ముకొనుటకు, కొబ్బరి చెక్కులను తీసుకొనుటకు ఒక సంవత్సరం కాలానికి బహిరంగ వేలం నిర్వహించారు. కొబ్బరికాయలు, పూజ సామాగ్రి అమ్ముకోవడానికి షాపులను 4,02,000/-రూపాయలకు, ఆలయం లోపల కొబ్బరి చెక్కలను తీసుకొనుటకు1,65,000/-రూపాయలకు నిమ్మని శేషాద్రిని హెచ్చు పాటదారుగా ఖరారు చేసినారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం పాట ఆదాయం పెరిగినట్టు ఆలయ ఈవో జే. భీమశంకరం తెలిపారు.

## దివ్యాంగురాలిపై ఫీల్డు అసిస్టెంట్ అత్యాచారయత్నం

**కరప, పెన్ పవర్, డిసెంబర్ 12:** స్నేహితుడిని సినిమాకెళదామని పిలవడానికెళ్లి, ఇంట్లో ఒంటరిగా ఉన్న దివ్యాంగురాలిపై ఒక ఫీల్డు అసిస్టెంట్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన కరప మండలం వేములవాడలో జరిగింది. పోలీసులు తెలిపిన కథనం మేరకు వేములవాడ గ్రామానికి చెందిన ఫీల్డుఅసిస్టెంట్ మట్టపర్తి వీరబాబు ఈ నెల 11వ తేదీన రాత్రి 9 గంటల సమయంలో తన స్నేహితుడిని సినిమాకెళదాం వస్తావా అడిగాడు. ఇంటివద్ద మాఅక్క ఒక్కర్తే ఉంది రానని చెప్పి వెళ్లిపోయాడు. ఇదే అదునుగా భావించిన వీరబాబు తన స్నేహితుడి ఇంటికెళ్లాడు. మానసికస్థిమితంలేని దివ్యాంగురాలు ఒక్కర్తే ఉంది. తల్లిదండ్రులు పనులు నిమిత్తం బయటకు వెళ్లారు. వీరబాబు దివ్యాంగురాలిపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నిస్తుండగా అదేసమయంలో నిందితుడి స్నేహితుడు పిన్నితో కల్సి ఇంటికి వచ్చేసరికి తలుపులు వేసి ఉండటంతో గట్టిగా కొట్టారు. వీరబాబు తలుపులుతీసి పారిపోయాడు. ఈవిషయం తెలుసుకున్న బాధితురాలి తల్లి గురువారం సాయంత్రం కరప పోలీసుస్టేషన్కు వచ్చి, ఫిర్యాదు చేశారు. కరప ఎస్ఐ టి.సునీత బాధితురాలి నుంచి స్టేట్మెంట్ తీసుకుని చికిత్సకోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పంపించారు. ఈమేరకు కరప ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గ్రామాల్లో సమస్యలు గుర్తించాలి... వాటిని అధికమించాలి...!

● ఎల్.ఎస్.డి.జిపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభం

**కొయ్యూరు, పెన్ పవర్ డిసెంబర్12:** పేదరికానికి కారణమైన, వ్యక్తిగత, సామాజిక అభివృద్ధికి నిరోధకాలను గుర్తించి వాటిని అధికమించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్ బాబు అభిప్రాయపడ్డారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా ఎంపీడీవో ఎస్ కె వి ప్రసాద్ అధ్యక్షతన ఎల్ ఎస్ డీజీ పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజైన గురువారం శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ – స్థానికంగా పేదరికాన్ని నిర్మూలించేందుకుగాను, అభివృద్ధిని సాధించేందుకుగాను ప్రజలు మూఢనమ్మకాలను, కుల వివక్షను, అంటరానితనాన్ని విడనాడాలన్నారు. దీనివలన ఆర్థిక అసమానతలు తగ్గి పేదరికం నిర్మూలించబడే అవకాశం ఉందన్నారు. ఇందులో భాగంగా విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామాలలో అక్షరాస్యత పెరిగితే యాదృచ్ఛింగానే నిరాక్షరాస్యత, మూఢనమ్మకాలు, వివక్ష, అంటరానితనం తగ్గుముఖం పడతాయన్నారు. విద్యతోపాటు పిల్లల పట్ల, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఏది ఏమైనా ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉంటే, పేదరికం తగ్గుముఖం పడుతూ, అభివృద్ధిని సాధించే వీలుంటుందన్నారు. గ్రామాలలో మౌలిక వసతులకు కూడా ప్రాధాన్యత నివ్వాలన్నారు. కార్యక్రమంలో సిడిపిఓ విజయకుమారి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శ్రీనివాస్, వెలుగు ఏపిఎం సాధన, ఏవో బాల మురళీకృష్ణ, పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమణకు గురైన స్థలాలపై విచారణ జరపాలి.:ఎమ్మెల్యే పల్లా

**గాజువాక పెన్ పవర్ డిసెంబర్ 12:**పారిశ్రామిక ప్రాంతం గాజువాక, రాజీవ్ నగర్ సచివాలయం ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెవెన్యూ సదస్సులో గాజువాక ఎమ్మెల్యే శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.భూ సమస్యలను పరిష్కరానికి అధికారులు బాధ్యతతో కూడిన నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు.. గతంలో కబ్జాలకు గురైన భూములను నిజమైన లబ్ధిదారులకు అందేలా అధికారులు పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో గాజువాక తాసిల్దారు తోట శ్రీవల్లి, వార్డు కార్పొరేటర్ లేళ్ళ కోటేశ్వరరావు,కూటమి నాయకులు నల్లూరు సూర్యనారాయణ , మాడిశా కనకరాజు, గంధం వెంకటరావు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



## పాటకుడిగానే కాదు మాటకూడిగా కూడా రానిస్తున్న డాక్టర్ దుడ్డు సత్యనారాయణ పాటలు, మాటలు.



**పాడేరు,పెన్ పవర్ డిసెంబర్ 12** అల్లూరి జిల్లా పాడేరు జిల్లా లో గ్రామ చైతన్య పాదయాత్ర పేరుతో సమాజసేవకు అడుగులు వేసిన ఈ సామాన్య మన్యం యువగయాకుడు,దుడ్డు సత్యనారాయణ. ఆనాడు ఎన్నో అవమానాలు, హేళనలు,వెక్కిరింపులు, ఎదుర్కొన్నాడు. అక్కడితో ఆగకుండా కళ్ళ ముందు కనిపిస్తున్న అన్యాయాన్ని మన్యంలో ప్రతి గడపకు తెలియాలని అందరూ చైతన్యం కావడం కోసం పాటల రూపంలో అందించాలని తన మెదడుకి సాన పట్టి కలానికి పదును పెట్టి అక్షరాల మాలగుచ్చి తన స్వరంతో 'మన్యం గాయకుడు' అనే ఒక యూట్యూబ్ ఛానల్ ఏర్పాటుచేసి తన స్వరంతో ఎన్నో అద్భుతమైన పాటలను మన్యం ప్రజలకు అందించారు. అంతేకాకుండా పాడేరు ప్రధానమైన పాడేరు పట్నంణం లో ప్రధానమైన సమస్య ట్రాఫిక్ పై తన పోరాటంతో పాడేరు పట్టణ వాసుల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు అంతేకాకుండా యువతను మంచి మార్గంలో నడిపే మోటివేషన్ స్పీకర్ కూడా రాణిస్తూ పాటకుడే కాదు మాటకుడు కూడా అంటూ అందరి మన్ననాలు పొందుతున్న ఈ మన్యం గాయకుడికి తన నిస్వార్థ సేవను గుర్తించి గత నెల ఢిల్లీలో గౌరవ డాక్టరేట్ తో సత్కరించారు కాబట్టి భవిష్యత్తులో ఇంకెన్నో గొప్ప గొప్ప కార్యక్రమాలకు శ్రీకరం చుట్టాలని ఆశిద్దాం

## LSDG పై శిక్షణా తరగతులు....






**నాతవరం పెన్ పవర్ (డిసెంబర్12):** %=+ూూ% కార్యాచరణ ప్రణాళిక (2024-25)లో భాగంగా ఎల్.ఎస్.డి.జి థీమ్స్ పై మండల స్థాయి అధికారులకు,సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి మండల స్థాయి శిక్షణ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు.గ్రామపంచాయతీల ప్రణాళికలో భాగంగా తొమ్మిది రకాల థీమ్స్ అయిన ఆరోగ్యవంతమైన గ్రామం, పరిశుభ్రమైన మరియు పచ్చని అయిన గ్రామం, నీటి సమృద్ధి గల గ్రామం,స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలు గల గ్రామం, సామాజిక న్యాయం మరియు సామాజికంగా పద్ధతి కలిగిన గ్రామం,సుపరిపాలన కలిగిన గ్రామం,మహిళా స్నేహపూర్వ గ్రామం,పేదరికం లేని మరియు మెరుగైన జీవనోపాధి ఉన్న గ్రామం, బాలహిత పంచాయతీల అంశంల పై శిక్షణను ఇచ్చారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఈఓపిఆర్డి ఎన్ ఎన్ వి మూర్తి,ఏ. ఓ.పి పార్థసారథి ,పి.ఆర్.ఏ.ఈ పి వెంకటేశ్వరమ్మ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఈ. దేవదత్తు, వెలుగు ఏపిఎం ఎం కనకరాజు,ఎలక్ట్రికల్ ఏఈ చంద్రమౌళి,వైద్యాధికారి ప్రసన్న అంగన్వాడి సూపర్వైజర్లు,సీనియర్ అసిస్టెంట్ ఎమ్మెస్ ప్రసాద్ పాల్గొన్నారు.

## అర్ధరాత్రి దీక్ష టెంట్ లో ఔట్ సోర్సింగ్ టీచర్స్.

- నిరసన తెలియజేయడానికి చలో విజయవాడ.



**పాడేరు,పెన్ పవర్,డిసెంబర్ 12**: రాష్ట్ర వ్యాప్తంగా గురుకులం లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ టీచర్స్ గత ఇరవై ఏడు రోజుల నుండి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, లెక్చరర్లు తమను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులనుండి కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్పు చేయాలని చేస్తున్న రిలే దీక్షలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల ఔట్ సోర్సింగ్ చేస్తున్న డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిశీలించి, మెగా డీఎస్సీ లో రిక్రూట్మెంట్ నుండి ఈ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్న 1402 పోస్టులను మినహాయించాలని, గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు లెక్చరర్ లను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చాలని, జి. ఓ.3 స్థానంలో షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేసిన తరువాత ఏజెన్సీ ప్రాంతంలో స్పెషల్ డిఎస్సీ ప్రకటన ఇచ్చి ఆదివాసీ లకు పక్షపాతిగా ప్రభుత్వం నిలబడి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఎన్నికల హామీ ను నిలబెట్టుకోవాలని ప్రభుత్వం ను ఔట్ సోర్సింగ్ టీచర్స్ డిమాండ్ చేశారు.

# హెల్త్ వెల్నెస్ సెంటర్స్ ఆకస్మిక తనిఖీ...





**కురుపాం /గరుగుబిల్లి,పెన్ పవర్, (డిసెంబర్12):** గ్రామీణ ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా హెల్త్%ఁ%వెల్నెస్ కేంద్రాల్లో వైద్య సేవలు అందించాలని వైద్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు పేర్కొన్నారు. మండలంలో గొట్టివలస,రావుపల్లి గ్రామాల్లో హెల్త్%ఁ%వెల్నెస్ కేంద్రాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో క్షేత్ర స్థాయి సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా అని పరిశీలించారు. కేంద్రంలో ప్రతీ రోజూ ఎంత మందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నారు, ఇస్తున్న చికిత్సా వివరాలు ఓపి రికార్డులో పరిశీలించారు. రోగుల ఆరోగ్య సమస్యలు స్పష్టంగా నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కేంద్రంలో ఉన్న వైద్య పరికరాలు, చేపడుతున్న పరీక్షల పై ఆరా తీశారు. పరీక్షల నివేదికలు సకాలంలో తెలియజేయాలన్నారు. మందుల లభ్యత,వాటి కాల పరిమితి తనిఖీ చేసి సద్వినియోగం చేయాలన్నారు. ఆరోగ్య సూచనలు తెలియజేసే గోడ పత్రికలను గ్రామాల్లో పలు చోట్ల ప్రదర్శించేయాలన్నారు. గర్భిణీ,శిశు గృహ సందర్శనలు చేసి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యం ఏ మేరకు మెరుగు పడుతుండో పర్యవేక్షించాలన్నారు. ఎన్సిడి,స్కూల్ హెల్త్,అంగన్వాడీ సర్వే లు పారదర్శకంగా నిర్వహించాలన్నారు.కొత్తగా గుర్తించిన ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించాలన్నారు.అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య స్థితి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏపెడిమిక్ ఈఓ సత్తిబాబు,సూపర్వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది విజయలక్ష్మి ,మంగమ్మ,జానకి,ఆశ కార్యకర్తలు ఉన్నారు.

## దబ్బకోట గ్రామంలో సిసి రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, డిసెంబర్ 12:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దారకొండ పంచాయతీలో స్థానిక సర్పంచ్ నడిగట్ల రాజు దబ్బకోట గ్రామంలో పంచాయితీ నిధులతో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచు రాజు మాట్లాడుతూ 15 ఫైనాన్స్ నిధులతో సుమారు 100 మీటర్ల సిసి రోడ్డు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ మాడి రామన్న, వార్డు సభ్యులు పోతురాజు జగన్నాథం మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## 87వ వార్డ్ లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు పనులు ప్రారంభం





- పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం

**గాజువాక పెన్ పవర్ డిసెంబర్ 12:**గాజువాక నియోజకవర్గం 87 వార్డు పరిధిలో సిద్దార్థ నగర్ కి అనుకోని ఉన్న సుమారు నాలుగు ఎకరాల యాభై సెంట్లు స్థలంలో జీవీఎంసీ నిధులతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేయుట కొరకు పనులు ప్రారంభించారు. స్థలంలో జరుగుతున్న పనులను కార్యకర్తలు మరియు వార్డు ప్రజలతో కలిసి రాష్ట్ర కార్యదర్శి, స్థానిక వార్డు కార్పొరేటర్ బోండా జగన్నాథం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఈ గ్రౌండ్ ను స్పోర్ట్స్ కాంప్లెక్స్ గా నిర్మించాలని సుమారు రెండు కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగింది, ప్రభుత్వం మారడం ఆ మంజూరు చేసిన నిధులను వేరే పనులకు కేటాయించడం జరిగిందని, కమిషనర్ , టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు గాజువాక నియోజకవర్గ శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు వార్డు పర్యటనలో భాగంగా ఈ స్థలాన్ని పరిశీలించి తక్షణమే ఈ స్థలాన్ని చదును చేయించి చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయమని ఆదేశించారు.గత రెండు రోజులనుండి ఈ పనులు జరుగుతున్నాయని ఈ గ్రౌండ్ లోపల చుట్టూ వాకింగ్ ట్రాక్, వృద్ధులకు, యువకులకు పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణ కలిగించే విధంగా గ్రౌండ్ ని తీర్చిదిద్దామని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు రాజన్ రాజ్, అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయరామరాజు, వర్రే రాంబాబు,పావడ రమణమూర్తి,ఆనంద్ కుమార్ , బొడ్డ సన్యాసి, డీవీ సూరిబాబు,భాగ్య లక్ష్మి,కడుపుట్ల శ్రీను, జాన్ రమేష్,ఆదినారాయణ,మూర్తి, దాలయ్య,చక్రవర్తి, పాల్, సచివాలయం సిబ్బంది, శానిటరీ సిబ్బంది, గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఒకే రోజు రెండు గంజాయి కేసులు నమోదు

కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ వెల్లడి



**కొయ్యూరు, పెన్ పవర్ డిసెంబర్ 12 :**మండలంలోని కొయ్యూరు పోలీస్ స్టేషన్‌లో గురువారం రెండు గంజాయి కేసులు నమోదయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మొదటి కేసులో 13 కిలోల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసుకున్నట్టు, అలాగే రెండో కేసులో 202 కిలోల గంజాయి, రెండు మోటార్‌సైకిళ్లు, అశోక్ లేలాండ్ గూడ్స్ క్యారియర్ స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్టు కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ తెలిపారు. కాగా మొదటి కేసులో రొంపుల గ్రామం నుండి రౌతులపూడికి తరలిస్తున్న గంజాయి బంగారమ్మపేట వద్ద పట్టుబడినట్టు, రెండవ కేసులో పెదవలస నుండి ఏలేశ్వరం గంజాయిని తరలిస్తుండగా కాకరపాడు గ్రామంలో పట్టుబడినట్టు ఆయన వివరించారు.

## ఉడా ఆదర్శ స్టేడియం ను అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దుతాం : పల్లా



**గాజువాక: పెన్ పవర్, డిసెంబర్ 12:**
జీవీఎంసీ 72వ వార్డులో ఉడా కాలనీ వినాయక నగర్ వద్ద వ 200 దయావాటర్ పైప్ లైన్ కు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు . రాష్ట్ర ప్రయోజనాలే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలోనే గాజువాక నియోజవర్గాన్ని అభివృద్ధి సంక్షేమల్లో అత్యున్నత నియోజకవర్గముగా తీర్చిదిద్దాతామని పల్లా అన్నారు . జీవీఎంసీ 72వ కార్పొరేటర్
స్టాలిన్ , తెలుగుదేశం నాయకులు ప్రసాదుల శ్రీనివాస్ , అక్కిన లక్ష్మణ్ రావు ,జిఎంసి జోనల్ కమిషనర్ వాటర్ సప్లై ఏఈ నాయకులు ఎస్ మాధవరావు , ఉడా కాలనీ సురేష్ , రామారావు , వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, ఎస్ మురళీ మనోహర్, బి సురేష్ బాబు, కే వంశీ, ఎం శ్రీనివాసరావు, టీ విజయ్,ఉషా రాణి, రత్నకుమారి, టి వాసవి, మంగ,జ్యోతి, కాలనీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి మండలంలో రెవెన్యూ సదస్సులు

కొయ్యూరు తాసిల్దార్ ఎస్ ఎల్ వి ప్రసాద్ వెల్లడి



**కొయ్యూరు, పెన్ పవర్ డిసెంబర్12:** ఈనెల 13 నుండి జనవరి 11 వరకు మండలంలో పంచాయతీల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు కొయ్యూరు తహసిల్దార్ ఎస్ ఎల్ వి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 13న రాజేంద్రపాలెం, 16న కొయ్యూరు, 17న మంప, 18న రేవళ్లు, 19న మర్రివాడ, 20న చీడిపాలెం, 23న ఎం. మాకవరం, 21న రావణా పల్లి, 24న అంతాడ, 25న బంగారం పేట -2, 26న బట్టపనుకుల, నడింపాలెం, 27న నడింపాలెం, 27న పెద మాకవరం, నడింపాలెం, 30న శరభన్నపాలెం -1, 31న వెలగలపాలెం, జనవరి2న డౌనూరు, 3న మూలపేట, డౌనూరు, 4న చిట్టింపాడు, 5న కొమ్మిక, కంటారం, 6న బాలారం, బకులూరు, 7న ఆడాకుల, 8న కినపర్తి, కొండ గోకిరి, రత్నంపేట, 9న ఎం. భీమవరం, 10న యు. చీడిపాలెం, 11న బూదరాళ్ల సచివాలయాల పరిధిలోని గ్రామాలలో రెవిన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తాసిల్దార్ వివరించారు. గ్రామాలలో ఉన్న భూసమస్యలను పరిష్కరించుకునే దిశగా ఈ సదస్సులను సద్వినియోగపరుచుకోవాలని తాసిల్దార్ సూచించారు.

# స్వర్ణాంధ్ర-2047 వేడుకకు జిల్లా వాసులు

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్టణం, డిసెంబర్ 12** :విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియం వేదికగా శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరగనున్న స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్ డాక్యు మెంటరీ ఆవిష్కరణ వేడుకలో భాగస్వామ్యమ య్యేందుకు జిల్లా వాసులు బయలుదేరి వెళ్లా రు.వివిధ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సం స్థల నిర్వాహకులు, సామాజిక వేత్తలు, ఎం. ఎస్.ఎం.ఈ పరిశ్రమల నిర్వాహకులు, పారిశ్రా మికవేత్తలు బస్సుల్లో పయనమై వెళ్లారు.సం బంధిత బస్సులను గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్ వద్ద జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మ యూర్ అశోక్ జెండా ఊపి ప్రారంభించారు. విజన్ డాక్యుమెంటరీని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిసెంబర్ 13వ తేదీ ఉదయం 10.00 గంటలకు ఇందిరా గాంధీ స్టేడియంలో రాష్ట్ర ప్రజల సమక్షంలో ఆవిష్కరిం చనున్నారు. దీనిలో భాగస్వామ్యమయ్యేందు కు జిల్లా నుంచి వివిధ వర్గాల ప్రజలు సుమారు 300 మంది ఆరు ప్రత్యేక బస్సుల్లో విజయవాడ పయనమయ్యారు. రాత్రికి అక్కడకు చేరుకొని శుక్రవారం జరిగే స్వర్ణాంధ్ర వేడుకలో భాగస్వా మ్యమవుతారు.



# రాజ్యసభ అభ్యర్థులలో లోకేష్ మార్క్...



**కాకినాడ, డిసెంబర్ 12, పెన్ పవర్:** రాష్ట్రంలోని అధికార టీడీపీలో రాజ్యసభ స్థానాల భర్తీ తరువాత లుకలుకలు నెలకొన్నాయి. పార్టీలోని సీనియర్లకు మొండి చెయ్యి దక్కడంపై అసంతృప్తితో ఉన్నారు. టీడీపీ రాజ్యసభ స్థానాన్ని నిన్నకాక మొన్న పార్టీలోకి వచ్చిన సానా సతీష్‌కు కట్టబెట్టడంపై ఆ పార్టీలో నేతలు గరంగరంగా ఉన్నారు. మరోవైపు కొంత మంది నేతలు సానా సతీష్‌పై ఉన్న కేసుల విషయాలను ప్రస్తావిస్తున్నారువైసీపీకి చెందిన బీదా మస్తాన్ రావు, మోపిదేవి వెంకటరమణ, ఆర్.కృష్ణయ్య తమ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో ఆ రాజ్యసభ స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీలో ఉన్న బలాబలాలను బట్టి ఈ మూడు స్థానాలు అధికార టీడీపీ కూటమికే వస్తాయి. అందులో భాగంగానే కూటమిలోని మూడు పార్టీల మధ్య చర్చోపచర్చలు అనంతరం టీడీపీ రెండు, బీజేపీకి ఒక స్థానం కేటాయించారు. జనసేనకు రాజ్యసభలో స్థానం దక్కలేదు. దీంతో జనసేన నేత నాగేంద్రబాబుకు రాష్ట్ర మంత్రివర్గంలో అవకాశం కల్పించేందుకు అంగీకరించారు.కూటమి పార్టీల మధ్య ఒప్పందం కుదరడంతో టీడీపీ నుంచి బీదా మస్తాన్ రావు, సానా సతీష్‌ను, బీజేపీ నుంచి ఆర్.కృష్ణయ్యను రాజ్యసభ అభ్యర్థులుగా ప్రకటించారు. అయితే నాలుగో అభ్యర్థి ఎవరూ లేకపోవడంతో ఈ ముగ్గురు దాదాపుగా ఏకగ్రీవం అయిపోయినట్లే. ఏకగ్రీవం అయినట్లు అధికారికంగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది. అయితే ఈ ముగ్గురులో ఇద్దరు వైసీపీ నుంచి టీడీపీ, బీజేపీలో చేరిన వారికే మళ్లీ టిక్కెట్లు ఇచ్చారు. బీదా మస్తాన్ రావు వైసీపీ నుంచి టీడీపీలో చేరగా, ఆర్. కృష్ణయ్య వైసీపీ నుంచి బీజేపీలో చేరారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మోపిదేవి వెంకటరమణకు మాత్రం అవకాశం దక్కలేదు. ఆయనకు ఎమ్మెల్సీ ఇస్తారని టీడీపీ వర్గాలు తెలిపాయి.ఇందులో మరో టీడీపీ రాజ్యసభ అభ్యర్థి సానా సతీష్‌పై ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది. ఆయనకు ఏ ప్రాతిపదిక రాజ్యసభ కట్టబెట్టారని టీడీపీలోని సీనియర్లే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టీడీపీలో రాజ్యసభ ఆశించిన సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడు, కంభంపాటి రామ్మోహన్ రావు, గల్లా జయదేవ్, దేవినేని ఉమామహేశ్వరరావు, వర్ల రామయ్య, అశోక్ గజపతిరాజు, కేఈ కృష్ణమూర్తి వంటి వారికి కాదని? కొత్తగా వచ్చిన సానా సతీష్‌కు రాజ్యసభ టిక్కెట్టు ఇవ్వడంపై టీడీపీ నేతలు గరంగరంగా ఉన్నారు.మరోవైపు గత వైసీపీ ప్రభుత్వ హయంలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఓటమి చెందుతామని తెలిసి కూడా వర్ల రామయ్య వంటి సీనియర్ నేతతో నామినేషన్ వేయించారు. ఆయన ఆ ఎన్నికల్లో ఓటమి చెందారు. కానీ ఇప్పుడు ఆయనకు ఇవ్వడానికి అవకాశం వచ్చింది. కానీ ఆయన పేరు మాత్రం ఖరారు కాలేదు. ఇక సుజనా చౌదరి, టీజీ వెంకటేష్, సీఎం రమేష్ లాంటి వారు పార్టీ ఫిరాయించి? ఏకంగా రాజ్యసభలో టీడీపీ పక్షాన్ని బీజేపీలో విలీనం చేసిన సమయంలో కూడా టీడీపీ పక్షానే చివరి ఉన్న కనకమేడల రవీంద్ర కుమార్‌కు కూడా టిక్కెట్టు ఇవ్వలేదుసరిగ్గా అసెంబ్లీ ఎన్నికల ముందు రాజకీయాల్లో వచ్చిన సానా సతీష్‌కు రాజ్యసభ టిక్కెట్టు వరించడం అందరూ ఆశ్చర్యానికి గురవుతున్నారు. సానా సతీష్ ఎన్నికల ముందు కాకినాడ లోక్‌సభ ఎంపీగా పోటీ చేద్దామనుకున్నారు. కాకినాడ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో భారీ స్థాయిల్లో బ్యానర్లు, భారీ పోస్టర్లతో హడావుడి చేశాడు. ఆ బ్యానర్లలోనూ, పోస్టర్లలోనూ ఏ పార్టీ అని చెప్పకుండా? టీడీపీ, బీజేపీ, జనసేన మూడు పార్టీ నేతల ఫోటోలు వేసి హల్‌చల్ చేశాడు. టీడీపీ తరపున కాకినాడ ఎంపీ టిక్కెట్టు ఇద్దామనుకున్నారు. కానీ ఈ టికెట్ ను తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు ఇచ్చారు. దీంతో సానా సతీష్ ఆ ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం నామమాత్రంగానే పని చేశారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కాకినాడ జిల్లా, రాష్ట్రంలోనూ తన హవా కొనసాగించాడు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌కు సానా సతీష్ సన్నిహితుడిగా గుర్తింపు పొందాడు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రివర్గం, నామినేటెడ్ పదవులు, టీటీడీ చైర్మన్ వంటి కీలకమైన పదవుల విషయంలో లోకేష్ మార్క్ ఉంది. పార్టీ లోపల, పార్టీకి అండదండగా ఉన్న వారి నుంచి ఎంత వ్యతిరేకత వచ్చినప్పటికీ? లోకేష్ పట్టుపడి తన అనుకునేవారికి ఆయా పదవులను వచ్చేటట్టు చేశారన్న చర్చ జోరుగా జరుగుతోంది.ఇందులో భాగంగానే టీటీడీ చైర్మన్ పదవి బీఆర్ నాయుడికి, రాజ్యసభ సానా సతీష్‌కు వచ్చాయన్న టాక్ వినిపిస్తోంది. బీఆర్ నాయుడికి టీటీడీ పదవి వచ్చినప్పుడు పార్టీలో పెద్దగా వ్యతిరేకత రాలేదు. కాకపోతే చంద్రబాబు నాయుడు సామాజిక వర్గం నుంచి కొంత మంది మాత్రమే వ్యతిరేకించారు. అందువల్లనే టీటీడీ బోర్డు నియామకం కూడా ఆలస్యంగా జరిగింది.ఇప్పుడు సానా సతీష్‌కు రాజ్యసభ టికెట్ ఇవ్వడంపై పార్టీలోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. ఇప్పటికే యనమల రామకృష్ణుడు పరోక్షంగా లేఖాస్త్రం సంధించారు. అలాగే సీనియర్ నేతలు కూడా చంద్రబాబు, లోకేష్ నిర్ణయాలపై విమర్శనాత్మకంగా చర్చించుకుంటున్నారు. గతంలో సానా సతీష్‌కు వ్యతిరేకంగా మీడియాలో పెద్ద కథనాలే వచ్చాయి. అలాంటి వ్యక్తి ఎలా రాజ్యసభ అభ్యర్థిగా ఖరారయ్యారనేది హాట్ టాపిక్ గా మారింది?

# తమ్ముళ్ల గుప్పిట్లోనే మద్యం దుకాణాలు



**గుంటూరు, డిసెంబర్ 12, పెన్ పవర్:** ఏపీలో ప్రైవేట్ మద్యం దుకాణాలు వేలంలో కేటాయించి రెండు నెలలు దాటుతున్న ఇంకా పలు ప్రాంతాల్లో దుకాణాలు తెరుచుకోలేదు. ప్రతి నియోజక వర్గంలో స్థానిక నాయకులే ప్రైవేట్ మద్యం దుకాణాల్లో వ్యాపారాన్ని చేజిక్కించుకున్నారు. లాటరీలో దుకాణాలు వచ్చినా వ్యాపారాలు మాత్రం చేయనివ్వడం లేదు.ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీ వివాదాస్పదంగా మారింది. అక్టోబర్ 16 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలు ప్రారంభమైనా ఇంకా పలు ప్రాంతాల్లో దుకానాలు తెరుచుకోలేదు. రాజకీయ మాటున మద్యం దుకాణాలను స్థానిక నాయకుల గుప్పెట్లోకి వెళ్లిపోయాయి. పేరుకు లాటరీలో మద్యం దుకాణాలు కేటాయింపు జరిగినా వ్యాపారాలు మాత్రం స్థానిక నాయకులే నిర్ణయిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీ రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులకు కాసులు కురిపిస్తోంది. మద్యం వ్యాపారం లాటరీల కేటాయింపులో పారదర్శకంగా జరిగినట్టు కనిపిస్తున్నా వ్యాపారాలు మాత్రం నియోజక వర్గాల వారీగా ప్రజాప్రతినిధుల అనుచరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో ఇంకా దుకాణాలు తెరుచుకోలేదు.కర్నూలు ప్రాంతానికి చెందిన ఓ మద్యం డిస్టిలరీ కంపెనీ తరపున ఏలూరు జిల్లాలో దుకాణాలకు టెండర్లు వేశారు. లాటరీలో ఆ సంస్థకు నాలుగు దుకాణాలు దక్కాయి. రాయలసీమ ప్రాంతం నుంచి వచ్చి తమ నియోజక వర్గంలో మద్యం వ్యాపారం చేయడమేమిటని స్థానిక నాయకుడు ఆగ్రహం వ్యక్తం చేయడంతో సీమ వ్యాపారులు వెనక్కి తగ్గారు. ఈ క్రమంలో మద్యం వ్యాపారంలో భారీ ఆదాయాన్ని ఆశించిన కొందరు వ్యక్తులు ఏలూరు జిల్లాలో లాటరీ దక్కించుకున్న కర్నూలు సంస్థతో కోట్ల రుపాయలు చెల్లించి వ్యాపార ఒప్పందాలు చేసుకున్నారువిజయవాడకు చెందిన అధికార పార్టీ నాయకుడి సిఫార్సుతో వ్యాపారం చేసేందుకు రెడీ అయ్యారు. స్థానికేతరులు ఎవ్వరు తన నియోజక వర్గంలో మద్యం వ్యాపారం చేయడానికి వీల్లేదని స్థానిక నాయకుడు తెగేసి చెప్పడంతో విజయవాడ వ్యాపారులు బిత్తర పోయారు. తమ డబ్బు తమకు ఇవ్వాలని కర్నూలు వ్యాపారుల్ని అడిగినా ఫలితం లేకపోయిందని చెబుతున్నారు. ఒప్పందాలు చేసుకునే సమయంలో ఏలూరులో ఉన్న పరిస్థితిని కర్నూలు వ్యాపారులు దాచి పెట్టడంతో డబ్బులు పెట్టిన వాళ్లు ఇరుక్కుపోయారు. లైసెన్స్‌లు వచ్చి రెండు నెలలు దాటుతున్నా ఈ వివాదం కొలిక్కి రాలేదు.ఓ మీడియా సంస్థ యజమానికి అనంతపురంలో మద్యం దుకాణాలు లాటరీలో దక్కాయి. అయితే తమ జిల్లాలో బయటి వ్యక్తులు వ్యాపారం చేయడానికి వీల్లేదని స్థానిక యువ నాయకుడు ఆదేశించడంతో ముఖ్యమైన వ్యక్తులతో సిఫార్సులు చేయించడంతో, జిల్లాలో అడుగుపెడితే తీవ్ర పర్యావసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అవతలి నుంచి హెచ్చరికలు వచ్చినట్టు సమాచారం. తమ జిల్లాలో మద్యం వ్యాపారంలో తమను నమ్ముకున్న వాళ్లే చేస్తారని తేల్చి చెప్పడంతో మౌనంగా ఉండిపోయినట్టు తెలుస్తోంది.మద్యం దుకాణాలను లాటరీలో దక్కించుకున్న వారు ఎంతటి వారైనా , రాజకీయ నేపథ్యం , అంగబలం, అర్ధబలం ఉన్నా నియోజకవర్గాల్లో ఉన్న సామంత రాజుల వంటి నేతలు చెప్పినట్టే వినాల్సిన ఉంటుంది. లైసెన్స్ వచ్చిన వారు ఏ ఇబ్బందులు లేకుండా అయా ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకోవాలంటే 30శాతం వాటా ఇవ్వాల్సిందేనని తేల్చి చెబుతున్నారు. కొన్ని చోట్ల 50శాతం వాటా కూడా వసూలు చేస్తున్నారు. మాట వినకపోతే ఎక్సైజ్ అధికారులతో నయానోభయానో ఒప్పిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ప్రజాప్రతినిధుల అనుచరులు, సమీప బంధువులు, వ్యక్తిగత సిబ్బంది ఈ తరహా దందాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లైసెన్సులు వచ్చినా తెరుచుకోని దుకాణాలు పెద్ద సంఖ్యలో ఉన్నట్టు తెలుస్తోంది. స్థానిక నాయకులతో రాజీ కుదిరిన తర్వాత వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతిస్తున్నారు.ఏపీలో 2019–24 మధ్య మద్యం దుకాణాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. మద్యం విక్రయాలతో 2024 మార్చి నాటికి రూ.36వేల కోట్లకు పైచిలుకు ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. ఖర్చులు మినహాయించగా దాదాపు రూ.30వేల కోట్లు ఖజానాకు సమకూరాయి. ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి వాటి స్థానంలో ప్రైవేట్ దుకాణాలను ఏర్పాటు చేయడంతో పెద్ద ఎత్తున పోటీ ఏర్పడింది.ఫలితంగా ప్రతి నియోజక వర్గంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు వ్యాపారాన్ని తమ గుప్పెట్లోకి తీసుకున్నారు. మద్యం వ్యాపారం, ఇసుక విషయంలో జోక్యం చేసుకోవద్దని పదేపదే ముఖ్యమంత్రి చెబుతున్నా వాటిని నేతలు చెవికి ఎక్కించుకునే పరిస్థితులు లేవు. బెదిరింపులు, బలవంతంగా వాటాలు లాక్కోవడం వంటివి ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఒప్పందాలు కుదిరిన చోట మాత్రమే వ్యాపారాలు సజావుగా సాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

# లెక్క తేలని 90 లక్షల విలువైన బియ్యం

**విజయవాడ, డిసెంబర్ 12, పెన్ పవర్:** మాజీ మంత్రి పేర్నినానిపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమయింది. నాని నిర్వహిస్తున్న గోడౌన్ లో రేషన్ బియ్యం గల్లంతు కావడంపై ఈ కేసు నమోదయింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అద్దెకు తీసుకున్న ఈ గోడౌన్ నుంచి 90 లక్షల రూపాయల విలువైన రేషన్ బియ్యం లెక్కలు తేలలేదు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని పౌరసరఫరాల సంస్థ ఎండీ జిలానీ ఆదేశించారు. బియ్యం గల్లంతు అయిన విషయంలో నానిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. నాని 1.80 కోట్ల రూపాయలు జరిమానా చెల్లించడంతో పాటు క్రిమినల్ కేసులను ఎదుర్కొనాల్సి వస్తుందని అధికారులు తెలిపారు. మచిలీపట్నంలో నానికి చెందిన గోదాములో గత ప్రభుత్వ హయాంలో పౌర సరఫరాల శాఖ అద్దెకు తీసుకుని అందులో బియ్యాన్ని ఉంచారు.నానిపై ఆగ్రహంతో... 2020లో అద్దెకు తీసుకున్న పౌర సరఫరాల శాఖ బస్తాకు ఐదు రూపాయలు చెల్లిస్తుంది. అయితే దాదాపు 90 లక్షల విలువైన బియ్యం మాయం కావడంపై పేర్ని నానిపై క్రిమినల్ కేసులు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాని ఏ విషయంలో దొరుకుతారా? అని ఎదురు చూస్తున్న కూటమి సర్కార్ కు బియ్యం మాయమవ్వడం అనువుగా లభించిందని చెబుతున్నారు. నానిపై టీడీపీ నేతలు ఎప్పటి నుంచో గుర్రుగా ఉన్నారు. వైసీపీ నుంచి అధికార ప్రతినిధిగా కాకపోయినా మాజీ మంత్రి గా ఆయన చేసే విమర్శలు నేరుగా చంద్రబాబు, లోకేష్ లతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను కూడా సూటిగా తగులుతున్నాయి. ప్రతిరోజూ మీడియా సమావేశం పెట్టి అధికార పార్టీపై విమర్శలు చేయడం కూడా కూటమి సర్కార్ కు మింగుడు పడలేదు. జనసేన కార్యకర్తలు పలుమార్లు మచిలీపట్నంలోని ఆయన ఇంటిపై దాడికి యత్నించారు. ధర్నాకు దిగారు. అలాంటి నాని పై ఇప్పుడు క్రిమినల్ కేసును నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పౌరసరఫరాల శాఖ ఎండీ ఫిర్యాదుతో ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయడమే కాకుండా భారీగా జరిమానా కూడా వసూలు చేయాలని నిశ్చయించింది. దీంతో పాటు నానికి చెందిన గోడౌన్ ను బ్లాక్ లిస్ట్ లో పెట్టే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నామని పౌర సరఫరాల శాఖ అధికారులు తె?పారు.

## 16 నుంచి ధనుర్మాసం....
## సుప్రభాత సేవకు బదులు తిరుప్పావై



**తిరుమల, డిసెంబర్ 12, పెన్ పవర్:** తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం ముఖ్యమైన అప్డేట్ ఇచ్చింది. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైనదిగా భావించే ధనుర్మాసం డిసెంబరు 16వ తేదీన ప్రారంభం కానున్నట్లు తెలిపింది. ఆరోజు ఉదయం 6.57 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభమవుతాయని పేర్కొంది.ధనుర్మాస ఘడియాల నేపథ్యంలో డిసెంబరు 17వ తేదీ నుంచి స్వామివారికి నిర్వహించే సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదిస్తారని టీటీడీ తాజా ప్రకటనలో వెల్లడించింది.. కాగా జనవరి 14న ధనుర్మాస ఘడియలు ముగియనున్నాయి.ధనుర్మాసం సందర్భంగా శ్రీవారికి విశేష కైంకర్యాలు నిర్వహిస్తారు. బిల్వ పత్రాలతో సహస్ర నామార్చన చేస్తారు. శ్రీవిల్లి పుత్తూరు చిలుకలను ప్రతి రోజూ స్వామివారికి అలంకరిస్తారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీవారికి విశేష నైవేద్యాలుగా దోశ, బెల్లం దోశ, సుండలు, సీరా, పొంగల్ వంటి ప్రసాదాలను నివేదిస్తారని టీటీడీ తెలిపింది.పురాణాల ప్రకారం ధనుర్మాసంలో దేవతలు సూర్యోదయానికి ఒకటిన్నర గంట ముందుగా నిద్రలేచి బ్రహ్మ ముహూర్తంలో శ్రీమహావిష్ణువును ప్రత్యేకంగా ప్రార్థిస్తారు. కావున ఈ మాసానికి సౌరమానంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.12 మంది ఆళ్వార్లలో శ్రీ ఆండాళ్(గోదాదేవి) ఒకరు. ఈమెను నాచియార్ అని కూడా పిలుస్తారు. శ్రీవేంకటేశ్వరస్వామివారిని స్తుతిస్తూ ఆండాళ్ రచించిన 30 పాశురాలను కలిపి తిరుప్పావై అంటారు.ఆళ్వార్ దివ్యప్రబంధంలో తిరుప్పావై ఒక భాగం. తమిళ సాహిత్యంలో దీనికి విశేష ప్రాచుర్యం ఉంది. శ్రీవారి ఆలయంలో నెల రోజులపాటు జరిగే తిరుప్పావై పారాయణంలో రోజుకు ఒకటి వంతున అర్చకులు నివేదిస్తారు. ఈ సందర్భంలో సాధారణంగా భోగశ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామివారికి ఏకాంతసేవ నిర్వహిస్తారు. ఈ తిరుప్పావై పఠనం పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది.

**12న తిరుమలలో చక్రతీర్థ ముక్కోటి:**

తిరుమలలో జరిగే ఉత్సవాల్లో అత్యంత ప్రముఖమైన చక్రతీర్థ ముక్కోటి ఈనెల 12వ తేదీన ఘనంగా జరుగనుంది. పౌరాణిక నేపథ్యంలో తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వెలసివున్న శేషగిరులమీద దక్షిణభాగంలో కొన్ని మైళ్ల దూరంలో మహా పవిత్రతీర్థమగు చక్ర తీర్థం వెలసివుంది. ప్రతి ఏడాది కార్తీక మాసం శుద్ధద్వాదశినాడు ఈ చక్రతీర్థ ముక్కోటి తిరుమలలో జరుగుతుంది.ఆరోజున స్వామివారికి ప్రాతఃకాల, మధ్యాహ్న ఆరాధనలు పూర్తి చేశారు. ఆ తరువాత అర్చకులు, పరిచారకులు, ఉద్యోగులు, భక్తులు, యాత్రికులు మంగళవాయద్యాలతో స్వామివారు ఆలయం నుండి ఊరేగింపుగా చక్రతీర్థానికి వెళతారు. చక్రతీర్థంలో వెలసివున్న శ్రీ చక్రత్తాళ్వారు వారికి, నరసింహస్వామివారికి, ఆంజనేయస్వామివారికి అభిషేకం, పుష్పాలంకారం, ఆరాధన చేస్తారు. హారతి నివేదించిన అనంతరం తిరిగి శ్రీవారి ఆలయానికి చేరుకుంటారు.వరాహ పూరాణ నేపథ్యంలో తిరుమలలోని శేషగిరులలో వెలసివున్న 66కోట్ల తీర్థాలలో అత్యంత ముఖ్యమైనవిగా చెప్పబడే సప్త తీర్థాలలో చక్రతీర్థము కూడా ఒకటిగా భాసిల్లుతోంది.

## ద్యోగుల డ్రెస్సుపై నేమ్ బోర్డు

**తిరుమల, డిసెంబర్ 12, పెన్ పవర్:** తిరుమలకు వెళ్తున్నారా.. అయితే ఈ కొత్త రూల్ గురించి తెలుసుకోండి. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, అన్ని చర్యలు చేపడుతున్న టీటీడీ మరో కొత్త రూల్ ప్రవేశపెట్టింది. ఈ రూల్ తో భక్తులకు మెరుగైన సేవలు అందించడమే టీటీడీ లక్ష్యంగా కనిపిస్తోంది. టీటీడీ చైర్మన్ గా నియమితులైన బీఆర్ నాయుడు మరో కొత్త రూల్ ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. ఇంతకు ఆ రూల్ ఏమిటి? అసలు ఈ రూల్ తో భక్తులకు ఏమేర మంచి చేకూరనుందో తెలుసుకుందాం.

కలియుగ వైకుంఠం శ్రీ శ్రీనివాసుడి దర్శనార్థం దేశ విదేశాల నుండి తిరుమలకు భక్తులు వస్తుంటారు. అటువంటి భక్తులు ప్రధాన ఎదుర్కొంటున్న సమస్యలపై టీటీడీ కొత్త చైర్మన్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో కొత్త రూల్ ప్రవేశపెడుతున్నట్లు స్వయంగా చైర్మన్ వెల్లడించారు. కొందరు టీటీడీ ఉద్యోగులు భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని తన దృష్టికి వచ్చిందని, భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తించే ఉద్యోగులపై చర్యలకు వెనుకాడబోనని చైర్మన్ తెలిపారు.భక్తులకు అసౌకర్యం కలిగించే టీటీడీ ఉద్యోగులను గుర్తు పట్టేందుకు ఉద్యోగుల దుస్తులపై త్వరలోనే నేమ్ బ్యాడ్జ్ ఏర్పాటు చేయాలని టీటీడీ భావిస్తోంది. ఎందుకంటే కొందరు ఉద్యోగులు భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, అటువంటి వారిని గుర్తించేందుకు టీటీడీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేమ్ బ్యాడ్జ్ ఇవ్వడం ద్వారా భక్తుల పట్ల అమర్యాదగా వ్యవహరించిన వారిని గుర్తించే అవకాశం ఉంటుంది.శ్రీనివాసుని దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల పట్ల బాధ్యతాయుతంగా, అంకితభావంతో టీటీడీ ఉద్యోగులు ప్రవర్తించేందుకు ఈ బ్యాడ్జ్ విధానం ఉపయోగకరంగా ఉంటుందని టీటీడీ పాలకమండలి భావిస్తోంది. టీటీడీ అన్ని విభాగాల్లో పనిచేసే ప్రతీ ఉద్యోగికి ఈ నేమ్ బ్యాడ్జ్ త్వరలోనే ఇచ్చేందుకు టీటీడీ ప్రయత్నం చేస్తోంది.ఈ రూల్ అమల్లోకి వస్తే, ఎవరైనా టీటీడీ ఉద్యోగి అమర్యాదగా ప్రవర్తిస్తే, మీరు ఆ నేమ్ బ్యాడ్జీ ద్వారా అతని వివరాలతో నేరుగా టీటీడీకి ఫిర్యాదు చేయవచ్చు. ఈ పద్ధతి ద్వారా భక్తులకు మెరుగైన సేవలను టీటీడీ ఉద్యోగులు కూడా అందించే వీలుంటుంది. అందుకే తిరుమలలో కొత్తగా అమలయ్యే ఈ రూల్ గురించి మీరు తెలుసుకోవాల్సిందే.

## కారు దగ్ధం మావోయిస్టుల పని కాదు. కలప స్మగ్లర్ల పని

**అల్లూరి పెన్ పవర్:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని సరివేల గ్రామం వద్ద మంగళవారం తెల్లవారుజామున కారు ధగ్ధం అయిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ కేసు మలుపు తిరిగింది.ఎటపాక గ్రామానికి చెందిన కార్పెంటర్ గుంటుపల్లి మనోజ్, గణేష్ అనే వ్యక్తులు నెల్లిపాక నుండి కారు (ఏ పి 20 ఏ ఈ 5258)ని తీసుకుని చింతూరు మండలం లోని పేగ గ్రామం లో టేకు కలప కోసం వెళ్లి సుమారు 5 దుంగలను వేసుకొని తిరుగు ప్రయాణం లో సరివేల గ్రామం దాటిన తర్వాత కారుని ఆపారు. దానిలో సీసాల్లో వున్న పెట్రోల్ లీకు అయ్యి బగ్గుమని మంటలు లే?చి వాహనం ధగ్ధం అయింది. ఈ ప్రమాదం లో కలప స్మగ్లర్ కు కూడా గాయాలైనట్టు తెలిసింది. దగ్ధమైన కారు చాసిస్ నెంబర్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. విషయం గురించి చింతూర్ సిఐ దుర్గప్రసాద్ ను వివరణ కోరగా కారు దగ్ధం చేసింది మావోయిస్టులు కాదని ఇంకా దర్యాప్తు చేస్తున్నామని పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని అన్నారు.


# టీ20 ఫార్మాట్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ..?

- వచ్చే ఏడాది పాకిస్థాన్‌లో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ
- దాయాది దేశంలో పర్యటించేది లేదన్న బీసీసీఐ
- పీసీబీ ముందు ఐసీసీ హైబ్రిడ్ మోడల్ ప్రతిపాదన
- ఇప్పటికీ తన వైఖరిని అధికారికంగా ప్రకటించని పాక్
- ఈ నేపథ్యంలో టోర్నీ కోసం ఇప్పటికే భారీగా డబ్బు వెచ్చించిన బ్రాడ్‌కాస్టర్ల ఆందోళన
- తెరపైకి వన్డే ఫార్మాట్ బదులు టీ20 ఫార్మాట్



**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే ఏడాది పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ విషయంలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. దాయాది దేశానికి తమ జట్టును పంపించేది లేదని ఇప్పటికే బీసీసీఐ తేల్చి చెప్పింది. దాంతో భారత్ లేకుండా టోర్నీ నిర్వహించడం కష్టం కనుక ఐసీసీ హైబ్రిడ్ మోడల్ ప్రతిపాదనను పీసీబీ ముందు ఉంచింది. అయితే, ఈ విషయంలో పాక్ తన వైఖరిని స్పష్టంగా చెప్పడం లేదు. దీంతో టోర్నమెంట్ షెడ్యూల్ విడుదల వాయిదా పడుతూ వస్తోంది. ఇక టోర్నీ ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 తేదీల మధ్య జరిగే అవకాశం ఉంది. దీంతో ఇంకో 75 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ నేపథ్యంలో టోర్నమెంట్ కోసం ఇప్పటికే భారీగా డబ్బు వెచ్చించిన బ్రాడ్‌కాస్టర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికీ షెడ్యూల్ ఖరారు కాకపోవడంతో మార్కెటింగ్ చేసుకోలేకపోతున్నామని వారు వాపోతున్నారు. ఈ నేపథ్యంలోనే షెడ్యూల్ త్వరగా ఖరారు చేయాలని ఐసీసీపై ఒత్తిడి పెరుగుతోంది. ఇక షెడ్యూల్ ప్రకటన మరింత ఆలస్యమైతే టోర్నీలో భారీ మార్పు జరిగే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. టోర్నీని ముందు అనుకున్నట్లు 50 ఓవర్ల ఫార్మాట్‌లో కాకుండా టీ20 ఫార్మాట్‌లో నిర్వహించే అవకాశం ఉందట. వన్డే ఫార్మాట్‌లో కాకుండా టీ20 ఫార్మాట్‌లో అయితే నష్టం వాటిల్లకుండా ఉంటుందని ప్రసారకర్తలు, కొంతమంది వాటాదారులు ఈ ప్రతిపాదనను తెరపైకి తీసుకొస్తున్నారని సమాచారం. "టోర్నీ నిర్వహణపై అనిశ్చితి ఇలాగే కొనసాగితే టీ20 ఫార్మాట్‌లో మార్చాలని కొంతమంది వాటాదారులు కోరే అవకాశం ఉంది. 50 ఓవర్ల ఫార్మాట్‌కు రానురాను ఆదరణ తగ్గిపోతుండటంతో టోర్నమెంట్‌ను టీ20 ఫార్మాట్‌లోకి మార్చితే వేగంగా, సులభంగా మార్కెటింగ్ చేసుకోవచ్చు" అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై ఐసీసీ కూడా పునరాలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

# ముంబై జట్టులో సూర్య లాంటి మరొకడు.. ఎవరీ సూర్యంష్ షెడ్గే..?



**హైదరాబాద్ పెన్ పవర్:** పృథ్వీ షా, అజింక్యా రహానే, శ్రేయాస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబే వంటి హేమాహెమీలున్న ముంబై జట్టులో 21 ఏళ్ల కుర్ర క్రికెటర్ పేరు బాగా వినపడుతోంది. మ్యాచ్ చివరలో అతను ఆడుతున్న గొప్ప గొప్ప ఇన్నింగ్స్‌లే అందుకు కారణం. భారత టీ20 స్పెషలిస్ట్ సూర్య క్రీజులో కుదురుకుంటే ఎలాంటి విధ్వంసం సృష్టిస్తాడో.. 21 ఏళ్ల బుడతడు సైతం అటువంటి విధ్వంసమే సృష్టిస్తున్నాడు. సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీలో 21 ఏళ్ల సూర్యంష్ షెడ్గే మంచి ప్రదర్శన కనపరుస్తున్నాడు. ఆంధ్రపై 8 బంతుల్లో 30 పరుగులు చేసి పాయింట్ల పట్టికలో ముంబైని అగ్రస్థానంలో నిలిపిన షెడ్గే.. బుధవారం విదర్భతో జరిగిన పోరులో 12 బంతుల్లో 36 పరుగులు చేసి జట్టును సెమీ-ఫైనల్ చేర్చాడు. విదర్భపై 224 పరుగుల ఛేదనలో షెడ్గే ఆడిన ఇన్నింగ్స్ చాలా గొప్పది. మ్యాచ్ చేజారింది అనుకున్న సమయంలో అద్భుతం చేశాడు. విజయానికి చివరి నాలుగు ఓవర్లలో 62 పరుగులు అవసరం కాగా.. మరో నాలుగు బంతులు మిగిలివుండగానే మ్యాచ్ ముగించాడు. దాంతో, షెడ్గే సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు.

**ఐపీఎల్ వేలంలో రూ.30 లక్షలు**

గత నెలలో జెడ్డా వేదికగా జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో సూర్యాంశ్ షెడ్గేను పంజాబ్ కింగ్స్ కొనుగోలు చేసింది. రూ. 30 లక్షల బేస్ ధరకు అతన్ని సొంతం చేసుకుంది.

# మహిళల అండర్ 19 టీ20 ప్రపంచ కప్.. ఐర్లాండ్ జట్టు ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే ఏడాది జనవరిలో మలేషియా వేదికగా మహిళల అండర్ 19 టీ20 ప్రపంచ కప్ జరగనుంది. మొత్తం 16 జట్లు టైటిల్ కోసం తలపడుతుండగా.. ఈ పదహారింటిని నాలుగు గ్రూపులుగా విభజించారు. ఆతిథ్య మలేషియాతో కలిసి భారత మహిళల జట్టు గ్రూప్- 'ఏ'లో ఉంది.ఈ మెగా టోర్నీలో పాల్గొనే ఆయా దేశాలు ఒక్కొక్కటిగా తమ జట్లను ప్రకటిస్తున్నాయి. ఇప్పటికే ఇంగ్లండ్, ఆస్ట్రేలియా తమ స్క్వాడ్ ప్రకటించగా.. తాజాగా ఐరిష్ క్రికెట్ బోర్డు తమ జట్టును ప్రకటించింది. 15 మంది సభ్యులు గల బలమైన జట్టును ఐరిష్ బోర్డు ఎంపిక చేసింది. కెప్టెన్‌గా అమీ హంటర్ ని నియమించిన సెలెక్టర్లు.. ఆమెకు డిప్యూటీగా నియామ్ మాక్‌నల్టీని ఎంపిక చేశారు.అమీ హంటర్ (కెప్టెన్), అబ్బి హారిసన్, జెన్నిఫర్ జాక్సన్, నియామ్ మాక్‌నల్టీ (వైస్-కెప్టెన్), ఐమీ మాగ్వైర్, లారా మెక్‌బ్రైడ్, కియా మెక్‌కార్ట్నీ, ఎల్లీ మెక్‌గీ, జూలీ మెక్‌నల్లీ, లూసీ సార్జెంట్, మిల్లీ స్పెన్స్, అన్నాబెల్ స్క్వైర్స్, ఆలిస్ టెక్టర్, ఆలిస్ వాల్ష్.

**ట్రావెలింగ్ రిజర్వ్ ప్లేయర్: రెబెక్కా లోవ్.**





2025, జనవరి 18 నుండి మహిళల అండర్ 19 టీ20 ప్రపంచ కప్ ప్రారంభం కానుంది. గతేడాది దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన ప్రారంభ ఎడిషన్‌లో భారత జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గా నిలిచింది.



ఈ లుక్‌లో కృతి శెట్టి ఫ్యాషన్ ఐకాన్

# శ్రీదేవి చిన్న కూతురు బికినీ దుమారం



**హైదరాబాద్ పెన్ పవర్:** అతిలోక సుందరి శ్రీదేవి కుమార్తెల హవా ఆ లెవల్లో ఉంది. జాన్వీ కపూర్ ఇప్పటికే కథానాయికగా చెప్పుకోదగ్గ స్థాయికి ఎదిగేసింది. ఇంకా పెద్ద స్టార్ గా ఎదగాలనుకుంటోంది. మరోవైపు శ్రీదేవి రెండో కుమర్తె ఖుషీ కపూర్ తన అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో ఉంది. వరుసగా రెండు సినిమాల్లో నటిస్తోంది ఈ బ్యూటీ.అక్కా చెల్లెళ్ల గ్లామర్ ట్రీట్ గురించి బోయ్స్‌లో ఎక్కువగా చర్చ సాగుతోంది. దీనికి కారణం సోషల్ మీడియాల్లో ఈ భామలు షేర్ చేస్తున్న వరుస ఫోటోషూట్లు. బికినీలు, స్విమ్ సూట్ లు.. టాప్ లెస్ ఫోజులతో కపూర్ గాళ్స్ దుమ్ము లేపుతున్నారు. ముఖ్యంగా అక్క జాన్వీని మించి ఖుషీ కపూర్ ఇటీవల చెలరేగిపోతోంది. తాజాగా ఖుషీ తన స్నేహితులతో కలిసి బీచ్ వెకేషన్ ని ఎంజాయ్ చేస్తున్న ఫోటోలు వీడియోలు ఇంటర్నెట్ లోకి వచ్చాయి. ఈ ఫోటోగ్రాఫ్స్ లో ఖుషీ ఆరెంజ్ కలర్ బికినీలో టూ హాలిగా కనిపిస్తోంది. మరోవైపు స్నేహితులతో చిల్ చేయడంలోను ఖుషీ ఎక్కడా తగ్గడం లేదు. ప్రస్తుతం ఈ స్నేహితుల గుంపు రచ్చకు సంబంధించిన ఫోటోలతో పాటు ఖుషి స్పెషల్ బికినీ ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. సంధ్యా సమయాన ఖుషీ ఆరెంజ్ బికినీలో సముద్ర స్నానాలకు రెడీ అవుతోంది. అదే సమయంలో అందమైన నవ్వుతో కవ్విస్తోంది.ఖుషీ కపూర్ ది ఆర్చీస్ సిరీస్ తర్వాత పెద్ద తెర ఆరంగేట్రానికి రెడీ అవుతోంది. అమీర్ ఖాన్ కుమారుడితో ఓ సినిమా, సైఫ్ ఖాన్ కుమారుడితో ఓ సినిమా చేస్తోంది. కానీ ఈ చిత్రాలు ఇంకా విడుదలకు రావాల్సి ఉంది. నందమూరి నటవారసుడు మోక్షజ్ఞ సరసనా ఖుషి నటించే వీలుందని కథనాలొచ్చాయి. కానీ దీనికి అధికారిక సమాచారం లేదు. ఖుషీ కెరీర్ ని షేపప్ చేసేందుకు బోనీకపూర్, జాన్వీ కపూర్ తమవంతు సహాయసహకారాలు అందిస్తున్నారు.



యోగితా బిహానీ కలర్ పాలెట్ మంత్రముగ్దుల ను చేస్తుంది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com